www.vishalabharati.com
epaper:vishalabharati.com

శుక్రవారం, హైదరాబాద్
29.03.2024
సంపుటి:2 సంచిక: 168

# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

## గుడ్ ఫ్రైడే శుభాకాంక్షలు


### సీఎం రేవంత్ రెడ్డి



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**
గుడ్ ఫ్రైడే సందర్భంగా తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి క్రిస్టియన్లందరికీ శుభాకాంక్షలు తెలిపారు. యేసుక్రీస్తు త్యాగాన్ని, ధైర్యాన్ని గుర్తు చేసుకున్నారు. శాంతి, కరుణ సందేశాలతో పాటు క్రీస్తు నేర్పిన సేవ, దయ, సోదరభావం ఇప్పటికీ ఎప్పటికీ మానవాళికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని అన్నారు. క్రీస్తు త్యాగాల జ్ఞాపకంగా జరుపుకునే గుడ్ ఫ్రైడే వేడుకలను క్రైస్తవ సోదర సోదరీమణులందరూ ఘనంగా జరుపుకోవాలని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు

# 100 కోట్లు ఎటుపోయాయి

- నన్ను అరెస్ట్ చేసేందుకు ఈడీ వద్ద ఆధారాలు లేవు
- ఏ కోర్టు నన్ను దోషిగా పరిగణించలేదు
- పార్టీని అణిచివేసేందుకు కుట్ర జరుగుతోంది..
- రౌస్ అవెన్యూ కోర్టులో సొంతంగా వాదించుకున్న కేజ్రీవాల్
- మరో నాలుగు రోజులు కస్టడీ పొడిగింపు



**విశాలభారతి,నేషనల్ బ్యూరో:**
ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో ఈడీ కస్టడీలో ఉన్న అరవింద్ కేజ్రీవాల్ కస్టడీని పొడగిస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. మరో నాలుగు రోజులు కస్టడీ పొడగిస్తూ కోర్టు నిర్ణయం తీసుకుంది. కేసు విచారణ సందర్భంగా కోర్టులో కేజ్రీవాల్ ఉద్వేగభరిత ప్రసంగం చేసినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఈడీపై పలు ప్రశ్నలు సంధించారు. గురువారం ఉదయమే కోర్టును ఆశ్రయించేందుకు కేజ్రీవాల్‌కు అనుమతి లభించింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఈడీపై కేజ్రీవాల్ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆమ్ ఆద్మీ పార్టీని అణిచివేసేందుకు ఈడీ ప్రయత్నిస్తోందని తీవ్ర ఆరోపణలు చేశారు. ఢిల్లీ లిక్కర్ కేసులో రూ.100 కోట్ల అవినీతి జరిగిందని ఈడీ చెబుతోందని.. మరి ఆ రూ.100 కోట్లు ఎక్కడికి పోయాయని కేజ్రీవాల్ ప్రశ్నించారు. ఈ కేసులో తనను అరెస్ట్ చేసేందుకు తగిన ఆధారాలు ఈడీ వద్ద లేవని తెలిపారు. ఏ కోర్టు కూడా తనను దోషిగా పరిగణించలేదని కేజ్రీవాల్ కోర్టు ముందు వాదించారు. ఢిల్లీ లిక్కర్ కేసులో సీబీఐ దాఖలు చేసిన 31 వేల పేజీల ఛార్జిషీట్‌లో, ఈడీ దాఖలు చేసిన 25వేల పేజీల ఛార్జిషీట్‌లో ఎక్కడా తన పేరు లేదని కేజ్రీవాల్ తెలిపారు. అయినా తనను ఎందుకు అరెస్ట్ చేశారని కేజ్రీవాల్ ప్రశ్నించారు. ఈ క్రమంలోనే తనను ఈ ఢిల్లీ లిక్కర్ కేసులో ఇరికించడమే లక్ష్యంగా ఈడీ అధికారులు ప్రవర్తిస్తున్నారని కేజ్రీవాల్ విమర్శలు గుప్పించారు. ఈ కేసులో అప్రూవర్‌గా మారిన మాగుంట రాఘవరెడ్డి ఇచ్చి

మిగతా 2లో

# కాంగ్రెస్‌లోకి కడియం, కేకే

- ఎంపీ అభ్యర్థిగా తప్పుకున్న కడియం కూతురు
- కేశవరావుతో కలిసి గ్రేటర్ హైదరాబాద్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి హస్తంలోకి..
- పార్లమెంట్ ఎన్నికల ముందు గులాబీ పార్టీకి భారీ దెబ్బ
- కీలక నేతలు దూరం కావడంతో భారాసలో ఆందోళన
- త్వరలోనే ఇంద్రకరణ్ రెడ్డి, గడ్డం అరవింద్ రెడ్డి కూడా హస్తం తీర్థం

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**
కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ పార్టీకి వరుసగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు ఎంపీ కే కేశవరావు, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మితో పాటు తాజాగా, మరో బీఆర్ఎస్ సీనియర్ నేత, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య ఆ పార్టీకి రాజీనామా చేశారు. తాను వరంగల్ బరి నుంచి తప్పుకుంటున్నట్లు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు కావ్య లేఖ రాశారు. బీఆర్ఎస్ నుంచి పోటీకి అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు.
ఇటీవల మీడియాలో వస్తున్న కథనాలు, అవినీతి, భూ కబ్జాలు, ఫోన్ ట్యాపింగ్, లిక్కర్ స్కాం .. పార్టీ ప్రతిష్టను దిగజార్చాయన్నారు. జిల్లా నేతల మధ్య సమన్వయం సహకారం కొరవడ్డాయన్నారు. ఎవరికి వారే అన్నట్లు పార్టీ నేతలు వ్యవహరిస్తున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో పోటీ నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నట్లు కావ్య తెలిపారు.

మిగతా 2లో



# బండి సంజయ్‌పై కేసు నమోదు

- ఎమ్మెల్యే రాజాసింగ్ హౌస్ అరెస్ట్
- ఇటీవల చెంగిచర్ల లో రెండు వర్గాల మధ్య ఘర్షణ
- ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన మరో 9 మందిపైనా కేసు నమోదు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**
బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ పై మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇటీవల మేడ్చల్ జిల్లాలోని చెంగిచెర్లలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో గాయపడిన వారిని పరామర్శించేందుకు బుధవారం అక్కడకు చేరుకున్న బండి సంజయ్ తో పాటు పలువురు బీజేపీ నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున పెద్ద ఎత్తున జనం గుమిగూడ వద్దని, మీరు ఇక్కడికి రావాలంటే ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకొని రావాలని బండి సంజయ్ పోలీసులు చెప్పారు. అయినా వినిపించుకోకుండా బండి సంజయ్ తో పాటు బీజేపీ నాయకులు.. పోలీసులు పెట్టిన బారికేడ్లను తోసుకుంటూ ముందుకు వెళ్లారు. ఈ క్రమంలో అడ్డుకున్న పోలీసులపై

మిగతా 2లో



TELANGANA STATE BOARD OF INTERMEDIATE EDUCATION
HYDERABAD

## ఇంటర్ కాలేజీలకు సెలవులు..

- ఈ నెల 30వ తేదీ నుంచి మే 31వరకు
- జూన్ 1వ తేదీన పునఃప్రారంభం

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**
తెలంగాణలోని ఇంటర్ కాలేజీలకు ఇంటర్మీడియట్ బోర్డు సెలవులు ప్రకటించింది. ఈ నెల 30వ తేదీ నుంచి మే 31వ తేదీ దాకా సెలవులు కొనసాగనున్నాయి. మళ్లీ జూన్ 1వ తేదీన కాలేజీలు తెరుచుకోనున్నాయి. ఈ సెలవులు రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రయివేటు, ఎయిడెడ్ ఇంటర్మీడియట్ కాలేజీలకు వర్తించనున్నాయి. ఇంటర్ బోర్డు ఆదేశాలను ఉల్లంఘించి కాలేజీలను నిర్వహించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వచ్చే విద్యా సంవత్సరానికి ఇంటర్ బోర్డు ఆదేశాలకు అనుగుణంగా అడ్మిషన్లు తీసుకోవాలని, ఆ తేదీలను ప్రకటించినప్పుడే ప్రవేశాల ప్రక్రియ చేపట్టాలని సూచించారు.

## కోర్టుల ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు రాజకీయ కుట్ర




- సీజేఐకి 600మంది లాయర్ల లేఖ
- న్యాయవ్యవస్థకు పొంచి ఉన్న ముప్పుపై ఆందోళన
- కోర్టు నిర్ణయాలు అనుకూలంగా లేకపోతే విమర్శలు
- ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని విజ్ఞప్తి

**విశాలభారతి,నేషనల్ బ్యూరో:**
రాజకీయ ఒత్తిళ్ల వల్ల న్యాయవ్యవస్థకు పొంచి ఉన్న ముప్పుపై ఆందోళన వ్యక్తం చేస్తూ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తికి దేశంలోని దాదాపు 600 మంది లేఖ రాశారు. కోర్టుల తీర్పులను ప్రభావితం చేయడానికి ఒత్తిడి వ్యూహాలను ప్రయోగిస్తున్న స్వార్థ ప్రయోజనాల సమూహం ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని

మిగతా 2లో



## కాంగ్రెస్ నిర్లక్ష్యంతో రైతులు ఆగం

- 15 నుంచి 20 లక్షల ఎకరాల్లో ఎండిన పంటలు
- ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువు
- రైతుల్లో భరోసా నిపండానికి క్షేత్రస్థాయిలో పర్యటన
- ఎమ్మెల్యే కేటీఆర్

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**
కాంగ్రెస్ పార్టీ నిర్లక్ష్య విధానాల వల్ల రైతులు ఆగమైపోతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో 15 నుంచి 20 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని చెప్పారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదని కాంగ్రెస్

మిగతా 2లో

## బీజేపీ వస్తే ప్రాథమిక హక్కులు కోల్పోతాం

- వివేక్ కుటుంబానికి ప్రజల బాధలు తెలియవు
- ఆస్తులు కాపాడుకోవడం మాత్రమే ఆరాటం
- కాంగ్రెస్ జాబ్ క్యాలెండర్ అంతా భూటకం
- ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

మిగతా 2లో






## 99.86 శాతం పోలింగ్

- ప్రశాంతంగా మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక
- ఓటు హక్కు వినియోగించుకున్న సీఎం రేవంత్ రెడ్డి

వివరాలు 2లో

## 6న 5 గ్యారంటీలు

- తుక్కుగూడలో కాంగ్రెస్ భారీ బహిరంగ సభ
- హాజరుకానున్న అగ్రనేతలు ఖర్గే, రాహుల్ గాంధీ
- లోక్‌సభ ఎన్నికల శంఖారావం పూరించేందుకు సర్వం సిద్ధం
- జాతీయస్థాయి గ్యారెంటీల అమలుతో కలిసొస్తుందని కాంగ్రెస్ అంచనా

వివరాలు 2లో

# కాంగ్రెస్‌లోకి కడియం, కేకే

**మొదటిపేజీ తరువాయి**

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కార్యకర్తలు తనను మన్నించాలని ఆ లేఖలో కావ్య పేర్కొన్నారు. కాగా, కడియం శ్రీహరితోపాటు కావ్య కూడా రేపు అంటే శుక్రవారం కాంగ్రెస్ పార్టీలోచేరే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అంతేగాక, కాంగ్రెస్ పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థిగా కడియం కావ్య బరిలో దిగనున్నారు. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ నేతలతో కడియం శ్రీహరితో ఈ విషయంపై చర్చలు జరిపారు. ఈ క్రమంలోనే కడియం శ్రీహరి, కావ్య గురువారం రాత్రి ఢిల్లీకి వెళ్లినట్లు తెలుస్తోంది. టీపీసీసీ చీఫ్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఇతర కాంగ్రెస్ అగ్రనేతల సమక్షంలో కడియం శ్రీహరి, కావ్య కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు తెలుస్తోంది. వరంగల్ జిల్లా నుంచి బీఆర్ఎస్ కీలక నేతగా ఉన్న కడియం శ్రీహరి పార్టీని వీడటం బీఆర్ఎస్ పార్టీకి పెద్ద నష్టమేనని చెప్పాలి. అంతేగాక, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య కూడా కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధమైన విషయం తెలిసిందే. అయితే, తాజాగా, కడియం శ్రీహరి, కావ్య కాంగ్రెస పార్టీలో చేరుతుండటం ఆసక్తికరంగా మారింది.

**కాంగ్రెస్ పార్టీ నాకు సొంత ఇల్లు : కేకే**

కాంగ్రెస్ నాకు సొంత ఇల్లు లాంటిది. ఆ పార్టీలో చనిపోవాలని ఉంది. తీర్థ యాత్రలకు వెళ్లిన వారు ఎప్పటికైనా ఇంటికే చేరుతారు. నేను కూడా నా సొంత ఇల్లు కాంగ్రెస్ పార్టీలో చేరుతా. 53 ఏళ్లు కాంగ్రెస్ పార్టీలో పని చేశాను. బీఆర్ఎస్ పార్టీలో నేను పని చేసింది కేవలం పదేళ్లు మాత్రమే. తెలంగాణ కోసమే బీఆర్ఎస్ పార్టీలో చేరాను. కాంగ్రెస్ పార్టీయే తెలంగాణ ఇచ్చింది. నేను మొదటిసారి కాంగ్రెస్ రెండో ప్రాధాన్యత ఓట్లతోనే రాజ్యసభకు ఎన్నికయ్యా. నేను పుట్టింది, పెరిగింది, కాంగ్రెస్ పార్టీలోనే.. ఆ పార్టీలోనే చనిపోవాలని అనుకుంటున్న. నేను బీఆర్ఎస్ పార్టీకి ఇంకా రిజైన్ చేయలేదు. నా కూతురు చేరిన రోజు నేను కాంగ్రెస్ పార్టీలో చేరడం లేదు. ఏరోజు కాంగ్రెస్ లో చేరేది తేదీ ఖరారయిన తర్వాత చెబుతా. నా కుమారుడు మాత్రం బిఆర్ఎస్ పార్టీలోనే ఉండాలి అనుకుంటున్నారు. ఇంద్రకరణ్ రెడ్డి, గడ్డం అరవింద్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు.

# కాంగ్రెస్ నిర్లక్ష్యంతో రైతులు ఆగం





**మొదటిపేజీ తరువాయి**

తెచ్చిన కరువన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సారంపల్లిలో ఇటీవల వడగండ్ల వానకు నష్టపోయిన పంటలను కేటీఆర్ పరిశీలించారు. పంటల నష్టంపై రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రైతుల్లో భరోసా నిపండానికి క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నామని తెలిపారు. డిసెంబర్ 9న రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ చెప్పిందని, ఇప్పటిరకు చేయలేదని విమర్శించారు. రైతుబంధుకు కేసీఆర్ సర్కార్ రూ.7 వేల కోట్లు సిద్ధం చేసిందని, కానీ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి పంటసాయాన్ని ఆపిందని చెప్పారు. తాము రైతుల కోసం ఉంచిన డబ్బులను కాంగ్రెస్ పార్టీ కాంట్రాక్టర్లకు ఇచ్చిందన్నారు. కౌలు రైతులకు కూడా రైతుభరోసా ఇస్తామని రేవంత్ రెడ్డి చెప్పారని, చివరికి వారిని కూడా మోసం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మేడిగడ్డలో కుంగిన మూడు పిల్లర్లను రిపేర్ చేయడానికి రేవంత్ రెడ్డికి చేతకావడం లేదని విమర్శించారు.

# 100 కోట్లు ఎటుపోయాయి

**మొదటిపేజీ తరువాయి**

7 స్టేట్‌మెంట్లలో 6 స్టేట్‌మెంట్లలో తన పేరు లేదని చెప్పారు. శరత్ చంద్రారెడ్డి అరెస్ట్ తర్వాత రూ. 55 కోట్లు ఎలక్టోరల్ బాండ్స్ ద్వారా బీజేపీకి ఇచ్చాడని ఈ సందర్భంగా కేజ్రీవాల్ గుర్తు చేశారు. శరత్ చంద్రారెడ్డితో బలవంతంగా తన పేరు చెప్పించారని ఆరోపించారు. ఈ సందర్భంగా ఈడీ అధికారులకు రెండు లక్ష్యాలు ఉన్నాయని పేర్కొన్న కేజ్రీవాల్.. అందులో ఒకటి తనను ఈ కేసులో ఇరికించడం.. రెండోది ఆప్‌ను లేకుండా చేయడమేనని కోర్టు ముందు చెప్పారు. ఇక ఈ కేసులో మరో 7 రోజులపాటు కేజ్రీవాల్‌ను కస్టడీకి ఇవ్వాలని ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టును ఈడీ కోరింది. రెండు వైపులా వాదనలు విన్న కోర్టు.. కేజ్రీవాల్ కస్టడీని మరో నాలుగు రోజులు పొడిగిస్తూ తీర్పు వెల్లడించింది. దీంతో ఏప్రిల్ 1 వ తేదీ వరకు కేజ్రీవాల్ ఈడీ కస్టడీలో ఉండనున్నారు.

# 99.86% పోలింగ్

**విశాల భారతి, నేషనల్ బ్యూరో :**

మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రశాంత వాతావరణంలో ముగియగా, భారీగా పోలింగ్ నమోదైంది. మొత్తం 1439 మంది ఓటర్లుండగా, అందులో 1437 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తంగా 99.86 శాతం పోలింగ్ నమోదైంది. కల్వకుర్తి ఎమ్మెల్యేగా కసిరెడ్డి నారాయణరెడ్డి గెలుపుతో, ఎమ్మెల్సీగా రాజీనామా చేయడం వల్ల ఉప ఎన్నిక నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరిగింది. ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా 10 పోలింగ్ కేంద్రాల పరిధిలో 1,437 మంది ప్రజా ప్రతినిధులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇద్దరు ఎంపీలు, 14 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో ఓటేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొడంగల్ ఎంపీడీవో కార్యాలయంలో, మంత్రి జూపల్లి కృష్ణారావు కొల్లాపూర్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో గెలుపును కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రతిష్ఠాత్మంగా తీసుకున్నాయి. కాంగ్రెస్ నుంచి మన్నె జీవన్ రెడ్డి, బీఆర్ఎస్ నుంచి నవీన్ కుమార్ రెడ్డి, స్వతంత్ర అభ్యర్థి సుదర్శన్ గౌడ్ భవితవ్యాన్ని ప్రజాప్రతినిధులు బ్యాలెట్ బాక్సులో నిక్షిప్తం చేశారు. ఆయా రాజకీయ పక్షాలు తమకు అనుకూలమైన ప్రజాప్రతినిధులను కర్ణాటక, మహారాష్ట్ర శిబిరాలకు తరలించారు. బస్సుల్లో నేరుగా వారిని పోలింగ్ కేంద్రాలకు తరలించడం ద్వారా తమ పార్టీకే ఓటు పడేలా జాగ్రత్తలు తీసుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి తన ఓటు హక్కు వినియోగించుకున్న అనంతరం కొడంగల్‌లో కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'ఓటు చాలా విలువైనది. ఎన్నికలు వస్తే సెలవులొస్తాయి, తీర్థయాత్రకు వెళ్దాం అనుకుంటారు. కానీ ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి. ఎన్ని కార్యక్రమాలున్నా ఓటు వేసేందుకు కొడంగల్ వచ్చాను. కార్యకర్తలను కలవాలని ఈ సమావేశం ఏర్పాటుచేశాను. నేను కష్టాల్లో ఉన్నప్పుడు కొడంగల్ ప్రజలు నా వెంట ఉన్నారు. నేను ప్రచారానికి రాకున్నా, నన్ను గెలిపించారు. ఎక్కడా ఉన్నా నా కన్ను కొడంగల్ అభివృద్ధిపైన ఉంటుంది' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# బండి సంజయ్‌పై కేసు నమోదు



**మొదటిపేజీ తరువాయి**

బీజేపీ శ్రేణులు విచక్షణ రహితంగా దాడి చేయడంతో వారికి గాయాలయ్యాయి. గాయపడిన పోలీసుల ఫిర్యాదు మేరకు బండి సంజయ్‌తో పాటు 9 మంది బీజేపీ నేతలపై కేసులు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

## ఎమ్మెల్యే రాజాసింగ్ హౌస్ అరెస్ట్



గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌ను మంగళహాట్ పోలీసులు గురువారం హౌజ్ అరెస్ట్ చేశారు. చెంగిచెర్లలో ఇటీవల రెండు గ్రూపుల మధ్య జరిగిన ఘర్షణకు సంబంధించిన బాధితులను పరామర్శించేందుకు కార్యకర్తలతో రాజాసింగ్ వెళుతున్నారన్న సమాచారం మేరకు పెద్ద సంఖ్యలో పోలీసు బలగాలు ఆయన ఇంటి వద్ద మోహరించి ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆయన బయటికి వెళ్లనివ్వకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా రాజాసింగ్ మాట్లాడుతూ.. పండుగ రోజు చెంగిచర్లలో దాడి జరిగితే అక్కడి పోలీసులు కేవలం ఏడుగురిపై మాత్రమే కేసులు నమోదు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇంత పెద్ద సంఘటన జరిగితే సీఎం స్పందించకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం వచ్చినా ఎంఐఎం కనుసైగల్లో కొనసాగుతున్నదని ఆరోపించారు. గాయాలైన వారిపై పోలీసులు అక్రమ కేసులు పెట్టారని.. వాటిని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. తాను ఒక ప్రజాప్రతినిధిగా పరామర్శించడానికి వెళ్తుంటే అడ్డుకోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా సీఎం స్పందించి ఘటనకు కారణమైన వందలాది మందిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై మంగళ హాట్ ఇన్‌స్పెక్టర్ ఎం మహేష్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఎలాంటి పర్మిషన్ లేకుండా రాజాసింగ్ చెంగిచెర్లకు వెళ్లేందుకు సిద్ధమయ్యారని తెలిపారు. లా అండ్ ఆర్డర్ సమస్య తలెత్తకుండా ముందస్తుగా ఇంటివద్దే అరెస్ట్ చేశామన్నారు.





# 6న 5 గ్యారంటీలు

**విశాల భారతి,స్టేట్ బ్యూరో:**

లోక్‌సభ ఎన్నికల శంఖారావం పూరించేందుకు కాంగ్రెస్ సిద్ధమైంది. తుక్కుగూడ వేదికగా సార్వత్రిక ఎన్నికలకు సమరశంఖం పూరించనుంది. ఏప్రిల్ 6న జరిగే ఈ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ హాజరవనున్నారు. ఈ సభలోనే లోక్‌సభ ఎన్నికల మేనిఫెస్టోను ప్రకటిస్తారు. ఇప్పటికే లోక్‌సభ ఎన్నికల మేనిఫెస్టోకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. ఇటీవల జరిగిన కర్ణాటక, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో గ్యారెంటీ స్కీమ్ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. లోక్‌సభ ఎన్నికల్లోనూ అదే వ్యూహాన్ని అనుసరిస్తోంది. 25 అంశాలతో గ్యారెంటీ స్కీమ్‌లను తమ మేనిఫెస్టోగా రూపొందించింది. 'పాంచ్ న్యాయ్' అంటూ మేనిఫెస్టోకు నామకరణం చేసింది. రైతులు, మహిళలు, యువత, బలహీన వర్గాలే లక్ష్యంగా.. 'హిస్సేదారి న్యాయ్', 'కిసాన్ న్యాయ్', 'నారీ న్యాయ్', 'శ్రామిక్ న్యాయ్','యువ న్యాయ్' పేరిట హామీలను ప్రకటించింది కాంగ్రెస్. ఈ హామీలను తుక్కుగూడ సభావేదిక ద్వారా తెలుగులో ప్రకటించనున్నారు ఖర్గే. హిస్సేదారి న్యాయ్ కింద సామాజిక, ఆర్థిక అంశాలతో పాటు కులాల ఆధారంగా జనగణన... రాజ్యాంగ సవరణ ఆధారంగా ఎస్సీ ఎస్టీ ఓబీసీలకు ప్రస్తుతమున్న 50 శాతం గరిష్ఠ పరిమితి తొలగింపు..ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ కోసం స్పెషల్ బడ్జెట్ లాంటి హామీలను ప్రకటించింది కాంగ్రెస్. ఇక కిసాన్ న్యాయ్ స్కీమ్ కింద స్వామినాథన్ ఫార్ములా ప్రకారం పంటలకు గిట్టుబాటు ధరకు చట్టబద్ధత... రుణమాఫీ కమిషన్ ఏర్పాటు... పంట నష్టపోయిన 30 రోజుల్లో బీమా పరిహారం చెల్లింపు లాంటి హామీలు చేర్చింది. శ్రామిక్ న్యాయ్ గ్యారెంటీ స్కీమ్‌లో రైట్ టు హెల్త్ చట్టం చేయడం.. రోజుకు 400 రూపాయల కనీస వేతనం.. అసంఘటిత రంగ కార్మికులకు జీవిత, ప్రమాద బీమాలను అందిస్తామని తెలిపింది. ప్రభుత్వంలో కాంట్రాక్టు ఉద్యోగాల నియామకాల నిలిపేస్తామని ప్రకటించింది. యువ న్యాయ్ కింద లక్షా 30వేల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని తెలిపింది. యువతకు ఏడాది అప్రెంటిస్‌షిప్ కల్పించి లక్ష రూపాయలు ఇస్తామని ప్రకటించింది. స్టార్టప్‌ల కోసం ఐదు వేల కోట్లు కేటాయింపు లాంటి పథకాలు చేర్చింది. నారీ న్యాయ్ పథకాన్ని ఇప్పటికే ప్రకటించిన కాంగ్రెస్.. ప్రతి పేద కుటుంబంలోని ఒక మహిళకు ఏడాదికి లక్ష రూపాయల ఆర్థిక సాయం... కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 50% రిజర్వేషన్లు... ఆశ, అంగన్వాడి, మిడ్ డే మీల్ వర్కర్లకు జీతంలో కేంద్రం వాటా రెట్టింపు... వర్కింగ్ విమెన్ కోసం సావిత్రిబాయి పూలే పేరుతో హాస్టళ్ల పెంపు లాంటి స్కీమ్‌లను చేర్చింది.





# ట్యాపింగ్ కేసులో మరొకరు..

- టాస్క్ ఫోర్స్ మాజీ డిసిపి అరెస్ట్
- భుజంగరావు, తిరుపతన్నకు ఐదు రోజుల కస్టడీ
- ప్రణీత్‌రావు కస్టడీ పిటిషన్ కొట్టివేసిన న్యాయస్థానం

**విశాల భారతి,స్టేట్ బ్యూరో:**

ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారం కేసులో మరో అధికారిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసు దర్యాప్తును ముమ్మరం చేసిన విచారణాధికారులు టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావును గురువారం రాత్రి అరెస్టు చేశారు. దర్యాప్తులో భాగంగా రాధాకిషన్‌రావుతోపాటు గతంలో ఎస్ఐబీలో సీఐగా పనిచేసిన గట్టు మల్లును కూడా ఉదయమే అదుపులోకి తీసుకొన్న పోలీసులు బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఇద్దరినీ రాత్రి వరకు విచారించారు. అనంతరం రాధాకిషన్‌రావును అరెస్టు చేసినట్టు ప్రకటించారు. గతంలో గట్టు మల్లు ఎస్ఐబీలో సీఐగా పనిచేసినందున మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావుతో ఉన్న సంబంధాలు, ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంలో రాధాకిషన్‌రావు, గట్టు మల్లు పాత్రపై దర్యాప్తు అధికారులు సుదీర్ఘంగా ప్రశ్నించినట్టు సమాచారం. ఈ కేసులో నిందితులుగా ఉన్న అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్నను ఐదు రోజులపాటు పోలీస్ కస్టడీకి అనుమతిస్తూ నాంపల్లి కోర్టు గురువారం ఆదేశాలు జారీచేసింది. శుక్రవారం వారిని చంచల్‌గూడ జైలు నుంచి దర్యాప్తు అధికారుల కార్యాలయానికి తరలిస్తారు. విచారణ చేపట్టిన అనంతరం వారినుంచి సేకరించే సమాచారం మేరకు మరికొందరిని అదుపులోకి తీసుకోనున్నారు. ఈ కేసులో అరెస్టుల సంఖ్య పెరిగే అవకాశమున్నదని దర్యాప్తు అధికారులు తెలిపారు.

## ప్రణీత్‌రావు కస్టడీ పిటిషన్ కొట్టివేత

ఎస్ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావును మరోసారి కస్టడీకి ఇవ్వాలని పోలీసులు వేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ 14వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కన్నయ్యలాల్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఏడు రోజుల కస్టడీకి అప్పగించగా, రెండోసారి అప్పగించడం చట్టవ్యతిరేకమంటూ నిందితుల తరఫు న్యాయవాది సుదీర్ఘ వాదనలను ఏకీభవించిన కోర్టు పిటిషన్‌ను తిరస్కరించింది. ఏసీపీ వెంకటగిరి సమక్షంలో కస్టడీ కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌పై పబ్లిక్ ప్రాసిక్యూటర్ చేసిన వాదనలను కోర్టు తోసిపుచ్చింది.

# కోర్టుల ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు రాజకీయ కుట్ర

**మొదటిపేజీ తరువాయి**

దేశ సర్వోన్నత న్యాయస్థానాన్ని కోరారు. ఈమేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్‌కు తమ సంతకాలతో ఓ లేఖను రాశారు. ఈ లేఖపై సంతకం చేసిన ప్రముఖ న్యాయవాదుల్లో హరీశ్ సాల్వే, మనన్ కుమార్ మిశ్రా, ఆదిష్ అగర్వాల్, చేతన్ మిత్తల్, పింకీ ఆనంద్, స్వరూపమ చతుర్వేది తదితరులు ఉన్నారు. ముఖ్యంగా రాజకీయ ప్రముఖులు, అవినీతి ఆరోపణలకు సంబంధించిన కేసుల్లో నిందితులుగా ఉన్నవారు న్యాయ వ్యవస్థ స్వతంత్రతకు భంగం వాటిల్లేలా ప్రవర్తిస్తున్నారని న్యాయవాదులు ఆరోపించారు. వారి చర్యల వల్ల ప్రజాస్వామ్య వ్యవస్థతో పాటు న్యాయ ప్రక్రియలపై ప్రజలకు ఉన్న నమ్మకానికి ముప్పు వాటిల్లుతోందని లేఖలో పేర్కొన్నారు. న్యాయవ్యవస్థ పనితీరును కించపరిచేలా 'స్వర్ణ యుగం', 'బెంచ్ ఫిక్సింగ్' లాంటి పదాలను కొందరు వెటకారంగా అర్థం వచ్చేలా ప్రయోగిస్తున్నారని న్యాయవాదులు ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ అజెండాతో న్యాయస్థానాలను అగౌరవపరిచే ఇలాంటి పదజాలాన్ని ప్రయోగించే వారిని ఉపేక్షించకూడదని వారు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్‌ను కోరారు. రాజకీయ ప్రయోజనాల కోసం కోర్టులను ఇబ్బంది పెట్టేందుకు కొంతమంది ఉద్దేశపూర్వకంగా అడ్డదిడ్డమైన ప్రకటనలు చేస్తున్నారని పేర్కొన్నారు. కోర్టులను ప్రభావితం చేయడం సులభం అంటూ పలువురు చేస్తున్న వ్యాఖ్యలు న్యాయవ్యవస్థపై ప్రజలకున్న నమ్మకాన్ని దెబ్బతీస్తున్నాయని 600 మంది లాయర్లు తమ లేఖలో పేర్కొన్నారు. 'రాజకీయ నాయకులు కొందరిపై అవినీతి ఆరోపణలు చేస్తారు. ఆ తర్వాత వారనే కోర్టుల్లో సమర్థించడం వింతగా ఉంది. కోర్టు నిర్ణయాలు తమకు అనుకూలంగా రాకపోతే వెంటనే బహిరంగ విమర్శలకు దిగుతున్నారు. సోషల్ మీడియాలో అవాస్తవాలను ప్రచారం చేస్తూ న్యాయమూర్తులపై ఒత్తిడి తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇలాంటి వాటిని ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించకూడదు' అని లేఖలో పేర్కొన్నారు. ఇలాంటి సవాళ్లను ఎదుర్కొని న్యాయవ్యవస్థ సమగ్రతను కాపాడేందుకు రక్షణ చర్యలు చేపట్టాలని భారత ప్రధాన న్యాయమూర్తిని అభ్యర్థించారు. ప్రజాస్వామ్యానికి బలమైన స్తంభంగా ఉండేలా న్యాయవ్యవస్థను నిలపాల్సిన అవసరం ఉందని న్యాయవాదులు అభిప్రాయపడ్డారు. సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్కు 600 మందికి పైగా న్యాయవాదులు రాసిన లేఖపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. ఇతరులను బుజ్జగించడం, వేధించడం పాతకాలపు కాంగ్రెస్ సంస్కృతి అంటూ ఎక్స్ వేదికగా ఆరోపించారు. న్యాయవ్యవస్థపై ఒత్తిడి తెచ్చేందుకు, న్యాయస్థానాల పరువు తీసేందుకు స్వార్థ ప్రయోజనాల బృందం ప్రయత్నిస్తోందని ఆరోపణలు చేశారు. "ఇతరులను బుజ్జగించడం, బెదిరించడం పాతకాలపు కాంగ్రెస్ సంస్కృతి. ఐదు దశాబ్దాల క్రితమే వారు 'కమిటెడ్ జ్యుడీషియరీ' కోసం పిలుపునిచ్చారు. వారు తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఇతరుల నుంచి నిబద్ధతను సిగ్గులేకుండా కోరుకుంటారు. కానీ దేశం పట్ల నిబద్ధతకు దూరంగా ఉన్నారు. 140 కోట్ల మంది భారతీయులు వారిని తిరస్కరిస్తున్నారంటే ఆశ్చర్యం లేదు" అని మోదీ పోస్ట్ చేశారు.

# బీజేపీ వస్తే ప్రాథమిక హక్కులు కోల్పోతాం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

కాంగ్రెస్ నేత వివేక్ వెంకటస్వామి కుటుంబానికి పేద ప్రజల బాధలు తెలియవని నాగర్‌కర్నూలు బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆస్తులు కాపాడుకోవడం వివేక్ వెంకటస్వామి కుటుంబం ఆరాటపడుతుందని విమర్శించారు. గోదావరిఖనిలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బాల్క సుమన్, కొప్పుల ఈశ్వర్‌తో కలిసి గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ వస్తే ప్రాథమిక హక్కులు కోల్పోతామని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. రిజర్వేషన్ల తీసివేతకు కేంద్రం కుట్రలు చేస్తుందని ఆయన విమర్శించారు. బీజేపీ గెలిస్తే బహుజనులు సర్వహక్కులు కోల్పోయే ప్రమాదం ఉందని అన్నారు. దేశంలో ఈడీ దాడులు సరికాదని అన్నారు. పంటలకు నీరందక రైతులు నష్టపోతున్నారని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ జాబ్ క్యాలెండర్ అంతా భూటకమని విమర్శించారు. బీజేపీ, కాంగ్రెస్‌లను గద్దె దించాలని ప్రజలను ఈ సందర్భంగా కోరారు. తెలంగాణ ప్రయోజనాల కోసం కృషి చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిద్దామని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను అధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.



## ఉపాధి హామీ పనులను పర్యవేక్షించాలి

- హాజరు శాతం తప్పనిసరి
- మెట్ల సమావేశంలో ఎంపీడీవో రామకృష్ణ

**పినపాక, విశాలభారతి :** ఉపాధి హామీ పనులను పర్యవేక్షించకుండా నిర్లక్ష్యం చేస్తే సహించేదని పినపాక ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. గురువారం పినపాక మండల కేంద్రంలో గల రైతు వేదికలో ఉపాది హామీ పనులపై పంచాయతీ కార్యదర్శులు, ఏపీవో, టీఏ, మెట్లు సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలకు ఇచ్చే డబ్బులు పెండింగ్‌లో పెట్టకుండా వెంటనే చెల్లిస్తే కూలీల సంఖ్య పెరుగుతోందన్నారు. గ్రామాల వారీగా ఉపాధి పనులకు ఎంత మంది వస్తున్నారనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. అన్ని గ్రామాల్లో కూలీల సంఖ్య పెంచి, ఉపాధి పనులు నాణ్యతతో చేయించాలని సూచించారు. కూలీ డబ్బులు పెండింగ్‌లో ఉంచకుండా సక్రమంగా చెల్లించాలన్నారు. హాజరు శాతం కచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. కొలత పద్ధతి ఆధారంగా ఉపాధి హామీ కూలీలకు నగదు చెల్లిస్తారని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో వెంకటేశ్వరరావు, ఏపిఓ వీరభద్ర స్వామి, ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.



## యూనిఫామ్స్ ఇప్పించాలి

**న్యాయవాదికి సెక్యూరిటీ గార్డ్ లు వినతి పత్రం అందజేత**

**మణుగూరు, విశాలభారతి :** 20 సంవత్సరాలుగా సెక్యూరిటీ కాంట్రాక్ట్ కార్మికులుగా విధులు నిర్వహిస్తున్న మాకు కాంట్రాక్టర్ ద్వారా ఖాకీ యూనిఫామ్ విప్పించాలని న్యాయవాది, సామజిక కార్యకర్త కర్నె రవికి వినతి పత్రం అందజేశారు. గురువారం ఉదయం మణుగూరు మండలం లోని రవి న్యాయవాది కార్యాలయం లో సింగరేణి ఏరియా నందు ఎస్ & పీసీ డిపార్ట్మెంట్ లో గత 20 సంవత్సరాలుగా సెక్యూరిటీ కాంట్రాక్టు కార్మికులుగా విధులు నిర్వహిస్తున్నామని, యూనిఫామ్ కోసం అధికారులకు, నాయకులకు పలు మార్లు చెప్పిన పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. సెక్యూరిటీ టెండర్, మ్యాన్ పవర్ ఏజెన్సీ టెండర్ దక్కిన కాంట్రాక్టర్ ద్వారా ఉచిత ఖాకీ యూనిఫాం ఇప్పించాలని కోరారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ సింగరేణి సెక్యూరిటీ విభాగానికి అనుబంధంగా పనిచేస్తున్న ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీ మురళి మ్యాన్ పవర్ ఏజెన్సీ కొత్త టెండర్ల కాంట్రాక్టర్ తో సింగరేణి అధికారులు తో మాట్లాడి ఖాకి యూనిఫామ్ ఇప్పించే ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. మురళి మ్యాన్ పవర్ ఏజెన్సీ టెండర్ లో కొంతమంది సింగరేణి గార్డ్స్ ఆ కాంట్రాక్టర్ కి మాయ మాటలు చెబుతూ మా పర్మినెంట్ గార్డ్స్ తో బాటు వారికి యూనిఫామ్ ఏ విధంగా ఇస్తారు అని ఆ కాంట్రాక్టర్ కి మాయ మాటలు నేర్పుతున్నారు అని కర్నే రవి అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది రాము, t.వి.శ్రీనివాస్, పి.సుదీర్, వీరబాబు ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్స్ సంపత్, సతీష్, మధు, సుజిత్, రవి, కటేశ్వర రావు పాల్గొన్నారు.



## కూకట్ పల్లి లో కాంగ్రెస్ లోకి వలసలు

**విశాలభారతి, కూకట్ పల్లి:**
కూకట్ పల్లి కాంగ్రెస్ లోకి వలసల పర్వం కొనసాగుతోంది. ఇప్పటికే పలువురు నేతలు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరగా తాజాగా అల్లాపూర్ డివిజన్ కు చెందిన మైనార్టీ నేతలు హస్తం గూటికి చేరారు. బిఆర్ఎస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండి షఫీద్దీన్ బీఆర్ఎస్ కు రాజీనామా చేసి తన వర్గం తో కలిసి కాంగ్రెస్ పార్టీ లో చేరారు. కూకట్పల్లి నియోజకవర్గ ఇన్చార్జి బండి రమేష్ వారికి పార్టీ కండువా కప్పు పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో కార్యకర్తలు అందరూ పార్టీ విజయం కోసం సైనికుల్లా పని, ఎంపీ అభ్యర్థి సునితమహేందర్ రెడ్డిని గెలుపుకోసం కృషి చేయాలని సూచించారు. బీఆర్ఎస్ కు చెందిన నేతలు కార్యకర్తలు, ఎండీ ఇలియాజ్, సయ్యద్ సలావుద్దీన్, ఎండీ ఖలీం, మూసా పేట డివిజన్ కు చెందిన శ్రీహరి పటేల్, కొండల్ రావు, లక్ష్మిపతి, చిన్నారావు, పంచముఖ్ విజయ్, కె సతీష్, రోహిత్, సాయి, శంకర్ ,ఫతేనగర డివిజన్ అధ్యక్షుడు కుక్కల రమేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో జయ, శారద, వారి అనుచరులు 20మంది మహిళలు ఇతరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీ బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు, ఓ బ్లాక్ అధ్యక్షులు పి. నాగిరెడ్డి, శేరి సతీష్ రెడ్డి, నయీమ్, వారల స్వామి, కుమార స్వామి, మద్దూరి రాము, నాగమణి, జ్యోతి, మారుతి, తదితరులు పాల్గొన్నారు

# సీఎం సాబ్..కృతజ్ఞతలు

- మెదక్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం..మీ నమ్మకాన్ని నిలబెడుతాం
- కాంగ్రెస్ పార్టీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థిగా నీలం మధు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన నీలం







**పటాన్ చెరు,విశాలభారతి:**
సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు మండలం చిట్కుల్ గ్రామానికి చెందిన నీలం మధు ముదిరాజ్ కు కాంగ్రెస్ పార్టీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థిగా ప్రకటించింది. దీంతో గురువారం నీలం మధు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. మెదక్ పార్లమెంట్ స్థానం నుండి పోటీ చేసేందుకు అవకాశం కల్పించినందుకు ఆయన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని అందరి సహకారంతో మెదక్ పార్లమెంటులో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తామని నీలం మధు ధీమా వ్యక్తం చేశారు. ఇందిరాగాంధీ లాంటి మహానేత ప్రాతినిధ్యం వహించిన మెదక్ పార్లమెంటు స్థానానికి తనను ఎంపిక చేయడం పట్ల తన అదృష్టమని చెప్పారు. ఇందిరాగాంధీ హయాంలోనే మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం పారిశ్రామికంగా అభివృద్ధి చెందిందని ఈ విషయాన్ని విరివిగా ప్రజల్లోకి తీసుకొని వెళ్లి విజయం సాధిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి దామోదర్ రాజనర్సింహ, జగ్గారెడ్డి, మైనంపల్లి హనుమంత్ రావు ఆశిస్సులతో పార్లమెంట్ పరిధిలో ఉన్న అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల ఇంఛార్జిలు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో కలుపుగోలుగా ఉంటూ కాంగ్రెస్ శ్రేణుల సహకారంతో మెదక్ సీటును కాంగ్రెస్ ఖాతాలో వేస్తామని స్పష్టం చేశారు.

### మంత్రి దామోదర రాజనరసింహ, కాంగ్రెస్ నేతలను కలిసిన నీలం

తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను మెదక్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ హైదరాబాదులోని మినిస్టర్ క్వాటర్స్ లో కలిశారు. తనను మెదక్ ఎంపీ అభ్యర్థిగా ఎంపిక చేయడంలో సహకరించినందుకు ఆయన మంత్రి దామోదర్ కు కృతజ్ఞతలు తెలిపి, రుణపడి ఉంటానని చెప్పారు. మంత్రితో పాటు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్ రావు, నర్సాపూర్ నియోజికవర్గ ఇంచార్జ్ ఆవుల రాజీరెడ్డి, మెదక్ జిల్లా డీసీసీ ప్రెసిడెంట్ ఆంజనేయులు గౌడ్ నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి, గజ్వేల్ నియోజికవర్గ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే నర్సిరెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఎలక్షన్ రెడ్డిలను నీలం మధు కలిశారు. ఎంపీ అభ్యర్థిగా తన ఎంపికకు సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. తనకు సంపూర్ణ ఆశీస్సులు కావాలనీ కోరారు. వచ్చే ఎన్నికల్లో సలహాలు, సూచనలకు అనుగుణంగా ప్రచారంలో ముందుకు వెళ్తానని నీలం మధు తెలిపారు.





## ఐదు రోజులు జాగ్రత్త

- భారీగా పెరగనున్న ఉష్ణోగ్రతలు
- అత్యధికంగా 43.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

తెలుగు రాష్ట్రాల్లో ఎండలు మండిపోతున్నాయి. రోజువారీ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఐదు డిగ్రీల వరకు పెరిగాయి. ముఖ్యంగా తెలంగాణలో ఆదిలాబాద్ జిల్లాలో ఎండలు ఠారెత్తిస్తున్నాయి. నిర్మల్ జిల్లా దస్తూరాబాద్‌లో గురువారం అత్యధికంగా 43.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కుమ్రంభీం జిల్లా ఆసిఫాబాద్‌లో 42.5 డిగ్రీలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాత నగర్‌లో 42.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇదిలా ఉంటే.. మరో ఐదు రోజుల పాటు ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఎండల తీవ్రత పెరుగుతున్న కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది. అత్యవసరమైతేనే బయటకు రావాలని అధికారులు సూచిస్తున్నారు.

## జెన్‌కో ఏఈ, కెమిస్ట్ ఉద్యోగ నియామకాల పరీక్ష వాయిదా

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**
తెలంగాణ జెన్‌కో ఏఈ, కెమిస్ట్ ఉద్యోగ నియామకాల రాత పరీక్షలు వాయిదా పడ్డాయి. లోక్‌సభ ఎన్నికల కోడ్ కారణంగా ఈ నెల 31వ తేదీన జరగాల్సిన పరీక్షలను జెన్‌కో వాయిదా వేసింది. పరీక్షలను ఎప్పుడు నిర్వహిస్తామనే తేదీలను త్వరలోనే వెల్లడిస్తామని పేర్కొన్నారు. ఈ రెండు పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు గమనించాలని సూచించారు.

## పెద్దపల్లి వివేక్ సామంత రాజ్యం కాదు

- కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను మరిచింది
- ఆరు గ్యారంటీల అమలులో పూర్తిగా విఫలం
- బాల్క సుమన్ ఫైర్



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**
కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను మరిచిందని బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ అన్నారు. ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాల మీద కాంగ్రెస్ కేసులు పెడుతుందని మండిపడ్డారు. గోదావరిఖనిలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కొప్పుల ఈశ్వర్, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా పెద్దపల్లిలో వివేక్ వెంకటస్వామి కుట్రలపై మండిపడ్డారు. వివేక్ కుటుంబం పెద్దపల్లిలో సామ్రాజ్యవాద విస్తరణకు కుట్ర చేస్తుందని బాల్క సుమన్ ఆరోపించారు. వ్యాపారాలు, పదవులు, ఆస్తులు కాపాడుకోవడానికి పెద్దపల్లిని వాడుకుంటున్నారని ధ్వజమెత్తారు. పెద్దపల్లి వివేక్ వెంకటస్వామికి సామంత రాజ్యం కాదని మండిపడ్డారు. వేల కోట్ల ఆస్తులున్న వివేక్ దమ్ముంటే జనరల్ సీట్లలో పోటీ చేయాలని సవాలు విసిరారు. పెద్దపల్లి ప్రాంత దళిత సామాజిక వర్గాలను వివేక్ కుటుంబం అణగదొక్కుతుందని అన్నారు




## కీసర గుట్టలో సామూహిక ఉపనయనం

**విశాలభారతి,కీసర :**
అఖిల బ్రాహ్మణ సమజాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కీసర గుట్టలో గురువారం అన్నపూర్ణ బ్రాహ్మణ నిత్యాన్నదాన సత్రంలో ఉచిత సామూహిక ఉపనయనం నిర్వహించారు.
సుమారు 16 మంది బ్రాహ్మణ బాలికలు శాస్త్రీయ బద్ధంగా ఉపనయనం అందించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు విశ్వనాథం మాట్లాడుతూ చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమం కీసర గుట్టలో జరగడం అని అన్నారు తమ సంస్థ నుండి చాలా మందికి ఉపనయనం అందిచమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏబిసిడి ఉపాధ్యక్షుడు పిఎన్ మూర్తి, సెక్రెటరీ సుబ్రహ్మణ్యం, జాయింట్ సెక్రెటరీ హరిప్రసాద్, వినోద్ కుమార్, బ్రాహ్మణ సత్రం ఉపాధ్యక్షుడు, ట్రెజరర్ హరిప్రసాద్, కార్యవర్గ సభ్యులు రాణి తదితరులు పాల్గొన్నారు.



# హత్య కేసుని చేదించిన పోలీసులు




■ **నేరస్తులను అరెస్టు చేసిన పోలీసులు**

**నల్లగొండ, విశాలభారతి:** మహిళ దగ్గర అప్పు తిరిగి ఇవ్వమనడంతో సదరు మహిళను హత్య చేసిన ఘటన నార్కట్ పల్లి మండల కేంద్రంలో జరిగింది. కేసుకు సంబంధించిన వివరాలను నల్లగొండ డిఎస్పి శివరాం రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ నార్కట్ పల్లి మండలం ఔరవాణి గ్రామానికి చెందిన ముప్పిడి పిచ్చమ్మ, వయస్సు 63 సం,అనే మహిళ కనబడుట లేదని, మృతురాలి తమ్ముడు పందుల యాదయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు నార్కెట్పల్లి పోలీసు స్టేషన్ లో ఉమెన్ మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా మార్చి 24న సాయంత్రం 4:30 గంటలకు మృతురాలి శవం ఔరవాణి గ్రామ శివారులో గల నక్రేకంటి అచ్చయ్య వ్యవసాయ భూమిలో నీరు లేని గూనల బావి లో శవాన్ని గుర్తించామని తలకు బలమైన గాయం వుండడం తో, మృతు రాలి మేనల్లుడు మరియు బందువుల అనుమానం మేరకు నేరస్థుడు ఎ 1 సిలువేరు లక్ష్మయ్య ను విచారించగా, సదరు లక్ష్మయ్య మృతురాలి తో శారీరక సంబందం కలిగియుండి, ఆమె వద్ద అప్పుగా రూపాయలు 1లక్ష 50వేలు తీసుకొన్నాడు, ఆమె తరచుగా డబ్బులు తిరిగి ఇవ్వమని అడుగుచుండ గా ఇస్తానని దాట వేసేవాడని ఎ2 నక్రేకంటి చంద్రమోహన్ తను కూడా మృతురాలి తో గతం లో అక్రమ సంబందం కలిగివున్నాడు, తను కూడా మృతురాలి వద్ద 1లక్ష రూపాయలు అప్పు గా తీసుకున్నాడు, ఎ 3 అంజయ్య కూడా 40వేలు అప్పుగా తీసుకున్నారు. డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగినందుకు సదరు ఎ 1, ఎ 2, ఎ 3 లు పథకం ప్రకారం మృతురాలిని ఔరవాణి గ్రామ శివారులో గల నక్రేకంటి అచ్చయ్య బావి వద్దకు రప్పించుకొని. కర్రలతో ముగ్గురు కొట్టి చంపి ఆమెపై నున్న బంగారం పూస్తేల తాడు తీసుకున్నారు. తదుపరి శవాన్ని నక్రేకంటి అచ్చయ్య నీరు లేని గూనల బావి లో పడవేసి సాక్షాలు లేకుండా చేయుటకు ప్రయత్నించారు. కేసుని చేధించిన నార్కట్ పల్లి సీఐ కైగూరి నాగరాజు, ఎస్సై ఎన్. అంతి రెడ్డి, నార్కెట్ పల్లి ఎఎస్ఐ ఆంజనేయులు, కానిస్టేబుల్ లనీ యస్.పి చందనా దీప్తి ఐపిఎస్, డిఎస్పీ శివరాం రెడ్డి లు అభినందించారు.



## విద్యార్థుల సంకల్పం గొప్పదైతే విజయం సులభమౌతుంది

■ **సత్యశోదక్ సొసైటీ చైర్మన్ నర్సయ్య**

**సిరికొండ, విశాల భారతి:**విద్యార్థుల లక్ష్యం, సంకల్పం గొప్పదైతే విజయం సులభమౌతుందనడానికి చక్కని నిదర్శనం పాఠశాల పూర్వ విద్యార్థిని మాలవత్ సుమలత అని, ఆమె చదువుతున్న సమయంలో డాక్టర్ కావాలనే దృఢ సంకల్పం, పట్టుదలతో శ్రమించిందని, ఆ శ్రమకు ఫలితం తనను డాక్టర్ అయ్యేలా చేసిందని సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య అన్నారు. మారుమూల పల్లెలో జన్మించి గ్రామీణ ప్రాంతంలో విద్యానభ్యసించి ప్రతిష్టాత్మకమైన వైద్య విద్య(MBBS)లో ప్రథమ శ్రేణి ఉత్తీర్ణత సాధించిన మాలవత్ సుమలతను గురువారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నర్సయ్య మాట్లాడుతూ.. సమాజంలో వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనది, అనారోగ్యులపట్ల అంకితభావం,మానవీయత, సేవాదృక్పతంతో చికిత్స చేసే వైద్యులు చిరస్మరనీయులని ప్రస్తుత పరిస్థితులలో వైద్యం చాలా విలువైనదని, నైపుణ్యంతో కూడిన వైద్య విద్యకు చాలా ప్రాముఖ్యత వున్నదని విద్యార్థులు వైద్య విద్యపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని తండ్రి విట్టల్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.




## బెల్లంపల్లి పట్టణంలోని పోస్ట్ ఆఫీస్ సందర్శన

**బెల్లంపల్లి, విశాల భారతి:**బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన కామర్స్ విద్యార్థులు గురువారం క్షేత్ర పర్యటనకు వెళ్ళినట్లు ప్రిన్సిపల్ టీఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. కామర్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్లు మేడ తిరుపతి, డాక్టర్ కాంపల్లి శంకర్, అధ్యాపకులు పి రవి, ఓ కిషన్ ల ఆధ్వర్యంలో ఈ క్షేత్ర పర్యటన కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. పర్యటనలో భాగంగా బెల్లంపల్లి పట్టణంలోని పోస్ట్ ఆఫీస్ ను సందర్శించారు. అక్కడ పలు విషయాలపై అవగాహన చేసుకున్నారు. బీమా పథకాలపై అవగాహన క్షేత్ర పర్యటనలో భాగంగా డిగ్రీ కామర్స్ విద్యార్థులు పోస్ట్ ఆఫీస్ లో పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, గ్రామీణ తపాలా బీమా అను పథకాల గురించి అవగాహన చేసుకున్నారు. ఈ క్షేత్ర పర్యటన కామర్స్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రిన్సిపల్ డాక్టర్ టి.ఎస్ ప్రవీణ్ కుమార్, ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టీఎస్ ప్రవీణ్ కుమార్, కామర్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు మేడ తిరుపతి, డాక్టర్ కాంపల్లి శంకర్, అధ్యాపకులు పి రవి, ఓ కిషన్, కామర్స్ ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరాల విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



## హీరో సుమన్ చేతుల మీదుగా హెల్మెట్ల పంపిణీ

**మంచిర్యాల, విశాల భారతి:**అంజనీ పుత్ర ఎస్టేట్స్ చైర్మన్ గుర్రాల శ్రీధర్ పుట్టిన రోజు సందర్భంగా ప్రముఖ సిని హీరో సుమన్ చేతుల మీదుగా హెల్మెట్ లను నేతకాని మహార్ హక్కుల పరిరక్షణ సంఘం జిల్లా అధ్యక్షులు పొట్టల నాగరాజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హీరో సుమన్ మాట్లాడుతూ హెల్మెట్లు పంపిణీ చాలా మంచి కార్యక్రమం అన్నారు. అనంతరం నాగరాజు మాట్లాడుతూ చాలా సందర్భాలలో హెల్మెట్ లేక మరణించిన సంఘటనలు ఎన్నో ఉన్నవి ,కాబట్టి ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్.డి జుల్ఫేకర్ హమ్మద్, జేమ్స్, పులి నాగరాజు, మల్లేష్ ,వినోద్ ,శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## ఆడబిడ్డ పెళ్లికి ఆర్థిక సాయం

**కల్వకుర్తి, విశాల భారతి:**పేదవారికి ఏ కష్టం వచ్చినా ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ అధినేత, బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ తలకొండపల్లి జడ్పిటిసి ఉప్పల వెంకటేష్ అన్నారు. రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం తులవానిగడ్డ గ్రామానికి చెందిన బేరి శృతి వివాహానికి ఆర్థిక ఇబ్బంది రావడంతో వారు ఉప్పల వెంకటేష్ ని సంప్రదించగా వెంటనే స్పందించిన ఆయన రూ. 15 వేలు ఆర్థికసాయం చేశారు. ఈ సందర్భంగా పెళ్లి కుమార్తె తండ్రి బేరి సుక్కయ్య మాట్లాడుతూ.. తన బిడ్డ పెళ్లికి ఆర్థిక సాయం అందించిన వెంకటేష్ సహకారాన్ని జీవితంలో మర్చిపోలేనని ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్ మిత్ర బృందం సభ్యులు తిరుపతి, బుచ్చిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## మాల మహానాడు నియోజకవర్గ అధ్యక్షులుగా రామస్వామి

**మంచిర్యాల, విశాల భారతి:**మంచిర్యాల జిల్లా కేంద్రంలోని అంబెద్కర్ భవన్ లో జాతీయ మాల మహానాడు జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు గజేల్లి లక్ష్మణ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో నస్పూర్ అంబెద్కర్ కాలనికి చెందిన గరిసే రామస్వామిని మంచిర్యాల నియోజకవర్గ అధ్యక్షులుగా నియమించారు. ఈ సందర్భంగా గరిసే రామస్వామి మాట్లాడుతూ తన మీద నమ్మకంతో మంచిర్యాల నియోజకవర్గ అధ్యక్షులుగా పదవి బాధ్యతలు అప్పగించినందుకు నాయకులందరికి ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గంలో మాలలందరిని ఐక్యం చేయటానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ సైనిక్ దళ్ రాష్ట్ర కన్వీనర్ ఆసాధి పురుషోత్తం, మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలితపు



శంకర్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి పలిగిరి కనకరాజు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నక్క శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ అభ్యర్థిగా నీలం మధును ప్రకటించడం హర్షణీయం

■ **నీలం మధకు ఎంపి టికెట్ కేటాయించిన సిఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు**



**మరిపెడ, విశాలభారతి:** మెదక్ కాంగ్రెస్ ఎంపి అభ్యర్థిగా నీలం మధును ప్రకటించడం పట్ల మరిపెడ మండల ముదిరాజ్ యువజన నాయకులు సాయి ముదిరాజ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గురువారం సాయి మాట్లాడుతూ మెదక్ ఎంపి అభ్యర్థిగా నీలం మధు ముదిరాజ్ ను ప్రకటించినందుకు సిఎం రేవంత్ రెడ్డికి, మంత్రి వర్గానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బిసి ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన నీలం మధుకు మెదక్ పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ పార్టీ ఎంపి అభ్యర్థిగా కేటాయించడం సంతోషంగా ఉందన్నారు. కాంగ్రెస్ తోనే అన్ని వర్గాల అభ్యున్నతి సాధ్యమవుతుందన్నారు. పేదల సంక్షేమ రాజ్యం అందించాలని కాంగ్రెస్ కృషి చేస్తుందన్నారు. ఇందుకోసమే గ్యారెంటీ పథకాలు అమలు చేస్తుందని తెలిపారు. మెదక్ ఎంపిగా నీలం మధు అత్యధిక మెజార్టీతో గెలవడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగేష్ ముదిరాజ్, వెంకట్ ముదిరాజ్, గణేష్ ముదిరాజ్, సాయి ముదిరాజ్, నాగరాజు ముదిరాజ్, వీరన్న ముదిరాజ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



## పాఠశాల సమస్యలు మంత్రి దృష్టికి తీసుకెళ్లండి

**భీమదేవరపల్లి, విశాల భారతి:**సర్కారీ బడులు సమస్యలకు లోగిళ్లుగా మారాయి. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో చదువుకుంటున్న పేద, మధ్యతరగతి, బడుగు, బలహీనవర్గాలకు చెందిన విద్యార్థులు అనేక సమస్యల నడుమ తమ చదువులు సాగిస్తున్నారు. పాఠశాలలోని సమస్యలను మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకువెళ్లాలని పాఠశాల ఉపాధ్యాయులు గ్రామ యూత్ అధ్యక్షుడు సిక క్రాంతికి గురువారం వినతిపత్రం అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రధానంగా మంచినీరు, మూత్రశాలలు,వంటగదుల సమస్య తీవ్రంగా ఉందన్నారు. ముఖ్యంగా పాఠశాలల్లో మరుగుదొడ్లు లేక విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు కూడా ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.




## చలివేంద్రాలు ఏర్పాటు

**భీమదేవరపల్లి, విశాల భారతి:**ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మండల అధ్యక్షుడు పృథ్వీరాజ్ గౌడ్ తెలిపారు. మండలంలోని సబ్ రిజిస్టర్, అంబేద్కర్ చౌరస్తాలో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..హుస్నాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని ఏరియాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనునిత్యం ప్రజా సేవలో జె ఎస్ ఆర్ ఉంటూ ప్రజా అవసరాలను తీర్చడంలో ఎంతో ఆనందం ఉందని పేర్కొన్నారు. వేసవికాలం ముగిసేంతవరకు ఈ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో సారయ్య, ఉసకోయిల కిషన్ ,శివసాగర్, దొంగల వేణు, బిక్షపతి, అయితే సాయి, బైరి సదానందం, ఆలుగు భాస్కర్, రాహుల్, అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ లో చేరిన పల్లికొండ ఎంపిటిసి

**బాల్కొండ, విశాల భారతి:**బాల్కొండ నియోజకవర్గం భీమ్‌గల్ మండలం పల్లికొండ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, ఎంపీటీసీ ఏశాల కృష్ణ బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రజారంజకమైన ప్రజా పాలనలో భాగస్వామ్యం కావడానికి ముత్యాల సునీల్ కుమార్ ఆధ్వర్యంలో నియోజకవర్గం అభివృద్ధిలో భాగస్వామ్యం కావడానికి,పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు చేరిన వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొదిరే స్వామి,పట్టణ అధ్యక్షుడు జె.జె నర్సయ్య,కుంట రమేష్, పల్లె శేఖర్,కొరాడి రాజు,లింబాద్రి, మహిపాల్,రాజేష్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే

**దేవరుప్పుల, విశాలభారతి:** మండల కేంద్రంలోని తిరుమల గార్డెన్ లో కొడకండ్ల మండలం, ఎంసి తండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు ధరావత్ రాఘవులు కుమార్తె వివాహం జరుగగా ఆ వివాహానికి హాజరై పాలకుర్తి నియోజక వర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి నూతన వధూవరులను ఆశీర్వదించారు.




## రైతుల సంక్షేమమే సహకార సంఘాల లక్ష్యం

■ **రైతుల సమిష్టి కృషితోనే సహకార సంఘం అభివృద్ధి**

**చిగురుమామిడి, విశాల భారతి:**రైతుల శ్రేయస్సే సహకార సంఘాల ప్రధాన ధ్యేయమని,రైతులకు రుణాలు అందించేందుకే సహకార సంఘాలు పని చేస్తున్నాయని సింగిల్ విండో చైర్మన్ జంగా వెంకట రమణారెడ్డి తెలిపారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలో గురువారం సింగిల్ విండో సర్వసభ్య చైర్మన్ రమణారెడ్డి అధ్యక్షతన జరిగింది.ఈ సర్వసభ్య సమావేశంలో సంఘం కార్యనిర్వాహణ అధికారి కాటం నరసయ్య వార్షిక నివేదికను రైతులకు ,సభ్యులకు వివరించగా సభ్యులు ఆమోదం తెలిపారు. అనంతరం చైర్మన్ రమణారెడ్డి మాట్లాడుతూ సంఘం పరిధిలో సభ్యులకు 8కోట్ల 67లక్షల రూపాయల క్రాప్ లోన్,3కోట్ల 64లక్షల రూపాయల దీర్ఘకాళిక,కర్షక మిత్ర లోన్ ద్వారా ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే గునుకులపల్లిలో పెట్రోల్ పంపు నిర్మాణం,మండల కేంద్రంలోని కార్యాలయం మొదటి అంతస్తు నిర్మాణం పనులు జరుగుతున్నట్లు తెలిపినారు. రైతుల సమిష్టి కృషితోనే సహకార సంఘం అభివృద్ధి చెందుతుందని,రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి కృషి చేయాలని రమణారెడ్డి కోరారు. ఈ వార్షిక సభలో నోడల్ ఆఫీసర్ మహమ్మద్ అలీ, సంఘ ఉపాధ్యక్షులు కరివేద మహేందర్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు ముద్రకోల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్సీగా జీవన్ రెడ్డి గెలుపు ఖాయం

■ **వనపర్తి ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డి**

**వనపర్తి, విశాల భారతి:**స్థానిక సంస్థ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మన్నే జీవన్ రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందుతాడని వనపర్తి ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డి అన్నారు. గురువారం ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఎంపిటిసిలు, జడ్పిటిసిలు, కౌన్సిలర్లతో కలిసి స్థానిక ఎమ్మెల్యే ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిల మధ్య హోరాహోరీగా జరుగుతున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మన్నే జీవన్ రెడ్డి గెలుపు ఖాయం అని అన్నారు. ఏప్రిల్ 2న వెలువడే ఎమ్మెల్సీ ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఘనవిజయం సాధించడం ఖాయమన్నారు.



## పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి టీకాలు

**ధర్పల్లి, విశాల భారతి:**ధర్పల్లి మండలంలోని దుబ్బాక గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మూడు నెలల పైబడిన వయసు గల ఆవులు, గేదెలు, దూడలకు గురువారం ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు ఇవ్వడం జరిగిందని పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి డా.జగన్నాధ చారి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దుబ్బాక గ్రామంలో సుమారు ఆరు వందల నుండి ఏడు వందల పశువులకు టీకాలు ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు డా. బాలీగ్ అహ్మద్, పశువైద్యాధికారి గంగా ప్రసాద్, సిబ్బంది శివ, సుభాష్, గోపాల మిత్రులు మహిపాల్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
GENERAL NEWS
www.vishalabharati.com
epaper:vishalabharati.com
జనరల్ న్యూస్
vishalabharathi Telugu Daily
5
శుక్రవారం, 29.03. 2023
హైదరాబాద్



# బల్దియా చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు గ్రీన్ సిగ్నల్

- **ఎన్నిక నోటిఫికేషన్ విడుదలకు ఎలక్షన్ కమిషన్ ఆదేశం**

**వనపర్తి, విశాల భారతి:**వనపర్తి మున్సిపాలిటీలో ఎన్నో రోజులుగా చైర్మన్, వైస్ చైర్మన్ పదవులకు రాజీనామా చేయాలని, లేనియెడల అవిశ్వాసం పెట్టే యోచనలో కౌన్సిలర్లు చేసిన ప్రయత్నాలు సఫలమయ్యాయి. గత నెల 26న అవిశ్వాసం పెట్టేందుకు జిల్లా కలెక్టర్ కి వినతిపత్రం ఇవ్వడంతో ఆయన ఆదేశాల మేరకు మార్చి 27 న అవిశ్వాసం పెట్టేందుకు నోటీసులు జారీ చేయడం జరిగింది. దీంతో చైర్మన్ గట్టు యాదవ్, వైస్ చైర్మన్ వాటికి శ్రీధర్.. మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 19న రాజీనామా పత్రం సమర్పించడం జరిగింది. అయితే కొత్తగా ఎన్నుకొని చైర్మన్, వైస్ చైర్మన్ పదవులకు ఎన్నికల కమిషన్ గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. వచ్చే నెల 4 న కౌన్సిలర్లకు నోటిఫికేషన్ సంబంధించిన నోటీసును జారీ చేయడం జరుగుతుందని, అలాగే వచ్చే నెల 6 న ఎన్నికల నిర్వహణ తప్పనిసరిని ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిన ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.



# ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే

**వనపర్తి, విశాల భారతి:**పట్టణంలోని బసవన్నగడ్డలో గల మదినా మసీదులో కాంగ్రెస్ మైనారిటీ నాయకుడు పజిల్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో గురువారం వనపర్తి ఎమ్మెల్యే తూడిమేఘా రెడ్డి పాల్గొని, ముస్లిం సహోదరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. పవిత్ర మాసంగా జరుపుకునే రంజాన్ మాసాన్ని ముస్లిం సోదరులు ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారని హిందూ, ముస్లింలు కలిసిపోయి రంజాన్ మాసాన్ని ఎంతో ఘనంగా జరుపుకుంటారని ఆయన అన్నారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ రాధాకృష్ణ, కౌన్సిలర్లు చీర్ల సత్యం సాగర్, వెంకటేష్ ,లక్ష్మీ రవి యాదవ్, కాంగ్రెస్ పార్టీ వనపర్తి పట్టణ అధ్యక్షుడు చెందర్ తదితరులు పాల్గొన్నారు.



# మహోన్నత వ్యక్తిత్వం గల వ్యక్తి శ్రీధర్

**మందమర్రి టౌన్, విశాల భారతి:**అంజనీపుత్ర సంస్థ చైర్మన్ గుర్రాల శ్రీధర్ పుట్టిన రోజు వేడుకలను జిల్లా కేంద్రంలో గురువారం అట్టహాసంగా నిర్వహించారు. అంజనీ పుత్ర సంస్థ ఎండీ పిల్లి రవి నేతృత్వంలో 3వేల మందితో రక్త దానం నిర్వహించారు. మిత్రులు, శ్రేయోభిలాషులు, అభిమానులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు మంత్రొచ్చరణల మధ్య శ్రీధర్ ను ఆశీర్వదించారు. ఈ సంధర్భంగా ముఖ్య అతిథిలుగా పాల్గొన్న మంచిర్యాల మున్సిపల్ చైర్మెన్ ఉప్పలయ్య, పలువురు మాట్లాడుతూ.. స్వయం కృషి, మంచి వ్యక్తిత్వం కలిగి ఉత్తర తెలంగాణ వ్యాప్తంగా నమ్మకమైన సేవలందిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చు కోవడం సంతోష దాయకమన్నారు. ఈ కార్యక్రమంలో అంజనీ పుత్ర సంస్థ ఎగ్జిక్యూటవ్ డైరెక్టర్ లు సంతోష్, కిషన్, అభిమానులు, కస్టమర్ లు తదితరులు పాల్గొన్నారు.

# మిషన్ భగీరథ నీటితో సీసీ రోడ్డు క్యూరింగ్

- **ఇందుకు ఏడ్జెర్ల, గుర్రప్పతండ జీపీల ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా**
- **ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఆయా గ్రామాల ప్రజలు**



**మరిపెడ, విశాలభారతి:** వేల కోట్లు పెట్టి ప్రభుత్వం ప్రజలకు మిషన్ భగీరథ తాగునీటి సరఫరా చేస్తుంటే, మరికొందరు వారి స్వార్థ ప్రయోజనాల కోసం వేసవిలో ప్రజల దహర్తి తీర్చే నీటిని సీసీ రోడ్డు క్యూరింగ్కు ఉపయోగిస్తున్నారు. ఈ సంఘటపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్న తీరు మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఎడ్జెర్ల గ్రామంలో చోటు చేసుకుంది. కథనం ప్రకారం... ఎడ్జెర్ల గ్రామంలో ఎస్సీ కాలనీలో ఇటీవల ఉపాధి హామీ నిధులు రూ. 5 లక్షల సీసీ రోడ్డు మంజూరు అయింది. సీసీ రోడ్డును దక్కించుకున్న కొందరు గుత్తేదారులు ఇట్టి రోడ్డు నిర్మాణాన్ని బుధవారం పూర్తి చేశారు. సీసీ రోడ్డు క్యూరింగ్ కోసం కాలనీకి సరఫరా అవుతున్న మిషన్ భగీరథ పైపు లైన్ గేట్ వాల్ ద్వారా నీటిని తోడుతున్నారు. తోడిన నీటిని ఎడ్జెర్ల, గుర్రప్పతండ గ్రామ పంచాయతీలకు చెందిన రెండు ట్రాక్టర్ ట్యాంకర్ల ద్వారా మిషన్ భగీరథ నీటిని సీసీ రోడ్డుకు ఉపయోగిస్తున్నారు. ఓ పక్క వేసవి మొదలై తాగు నీరు లేక ఇబ్బందులు పడుతుంటే మరో పక్క ప్రభుత్వం సరఫరా చేస్తున్న మిషన్ భగీరథ నీటిని సీసీ రోడ్డుకు ఉపయోగించడంపై ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్షంతోనే ఇంతటి దారుణం జరుగుతుందని, విచారణ చేపట్టి వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# అవినీతిపై చర్చ జరపాలి

- **ఎంపీటీసీ మాడూరీ జ్యోతి**



**రామన్నపేట, విశాలభారతి:** ఎంపీపీ కన్నేబోయిన జ్యోతి మండల పరిషత్ నిధులను దుర్వినియోగం చేసి అధికారాన్ని అడ్డం పెట్టుకొని నిధులను మొత్తం కూడా సభ్యుల తీర్మానాలు, ప్రోసిడింగులు లేకుండానే పనులు చేసి,పనులు చేయని వాటికి కూడా చేసినట్లుగా సృష్టించి డబ్బులను దుర్వినియోగం చేశారని ఆమే చేసిన అవినీతిపై చర్చ జరపాలని మండల పరిషత్ సమావేశంలో సభ్యులందరం కోరామని దుబ్బాక ఎంపీటీసీ మాడూరి జ్యోతి తెలిపారు ఆమె పట్ల ఎంపీటీసీ సభ్యులు ఎవరు కూడా దురుసుగా మాట్లాడిన దాఖలాలు లేవు అని 30వ తేదీన అవిశ్వాసంలో బలం నిరూపించుకోవడం కోసం బలం లేక,తన తప్పులు బయటపడతాయనే సాకుతోనే రాజీనామాకు సిద్ధమైందని రాజీనామా లేఖలో ఎవరి ఒత్తిడి లేకుండా వ్యక్తిగత కాలంలో రాజీనామా చేశానని చెబుతూనే అధికారం పార్టీ ఎంపీటీసీలు ఇబ్బందుల గురి చేశారని చెప్పడం సమంజసం కాదని ఆమె అన్నారు.

# అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఫీల్డ్ ఆఫీసర్

- **నోటు కొట్టు ఉపాధి పథకం బుక్ పట్టు**
- **ఉపాధి హామీ పథకం బుక్కు ఉన్న బుక్కుపై పేరు ఎక్కించడంలో విఫలమైన ఎంపీడీవో**



**కురవి ,విశాలభారతి:** బంచరాయితండ గ్రామ పంచాయితీ పరిధిలో ఉన్నటువంటి ఉపాధి హామీ కార్మికుల వద్ద అక్రమంగా డబ్బులకు పాల్పడుతూ డబ్బులు ఇస్తేనే ఉపాధి హామీ పథకం బుక్కు పై పేరు పెట్టిస్తానని, లేనియెడల ఉపాధి హామీ బుక్కు పై మీ పేరు ఉండదని, సమాధానం ఇస్తున్నారు. ఈ విషయం బంచరాయితండ పంచాయతీ లో హాట్ టాపిక్ గా మారింది. గత కొన్ని రోజులుగా బానోత్ సక్రాం,సివి, ఉపాధి హామీ పథకం బుక్కు కోసం ఫీల్డ్ అసిస్టెంట్ వీరన్న కు బుక్ పై పేరు ఎక్కించమని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫీల్డ్ ఆఫీసర్ నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారని వారు వాపోయారు. గత సంవత్సరంలో బానోత్ సక్రాం అనే కార్మికుడు ఉపాధి హామీ పథకంలో గుంటలు తీసిన కూడా వారికి డబ్బులు రాని వైనం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గత సంవత్సరంలో పనిచేసిన కార్మికులకు ఇప్పుడు దాకా పైకం వాళ్ల చేతికి రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా పని చేయించుకున్న తర్వాత కూడా మీ పేరు బుక్కులో లేదు అది ఎంపీడీవో ఆఫీస్ కి వెళ్ళాలి అక్కడి నుంచి కలెక్టర్ ఆఫీస్ కి వెళ్ళాలని శీతా కథలు అల్లుతున్నారు. అదంతా రిస్క్ ఉంటది మీరు రిస్కు చేయలేరని, పైసలు ఇస్తేనే పని అయితది లేకుంటే పని కాదు అధికారులు కూడా పైసలు తీసుకొని పనిచేస్తున్నారని, నమ్మబలుతున్నారు. నేను చేపిస్తా మీకెందుకు శ్రమ అక్కడ ఆఫీసర్లకు కోంత ఇస్తేనే పని అయితుంది. తక్షణమే ఈ విషయంపై చర్చించి ఉపాధి హామీ కార్మికులు పేర్లను నమోదు చేసుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఎంపీడీవో ఆఫీస్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.



# యువత స్వయం ఉపాధిపై దృష్టి సారించాలి

- **జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్.**

**మరిపెడ, విశాలభారతి:** నేటి యువత స్వయం ఉపాధి మార్గాల పై దృష్టి సారించాలనీ జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్ అన్నారు. మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని ఎంపీడీవో కాంప్లెక్స్ లో మండలంలోని వీరారం గ్రామానికి చెందిన మామిడాల మునేష్ అనే యువకుడు 'సాగర్ మెన్స్ బ్యూటీ పార్లర్ అండ్ హెయిర్ స్టైల్' షాపును మరిపెడ ఎంపీపీ గుగులోత్ అరుణ రాంబాబుతో కలిసి నవీన్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఉపాధి మార్గాలపై దృష్టి సారించాలన్నారు. నిరుద్యోగులు ప్రభుత్వ ఉద్యోగాల కోసంఎదురు చూడకుండా స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకొని కుటుంబానికి ఆసరాగా నిలవాలన్నారు. చిన్న తరహా పరిశ్రమలను ఏర్పాటు చేసుకుని పలువురికి ఉపాధి కల్పించడంతోపాటు సమాజంలో ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో కేలోత్ హరినాయక్, బీఆర్ఎస్ నాయక్ లు అజ్మీరా హరి నాయక్, జర్పుల కాలు నాయక్, బొల్లం నర్సయ్య,దిగజర్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్.. బాలుడికి తీవ్ర గాయాలు


- **మొక్కజొన్న పంటకు అమర్చిన విద్యుత్ తీగకు తగలడంతో ప్రమాదం**



**వాజేడు, విశాలభారతి**: విద్యుత్ ఘాతకంతో యువకుడికి తీవ్రగాల గాయాలైన సంఘటన వాజేడు మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ములుగు జిల్లా వాజేడు మండలం చెరుకూరు గ్రామంలో అమ్మమ్మ వాళ్ల నివాసం నందు ఉంటున్న ములుగు జిల్లా గోవింద రావుపేట మండలం చల్వాయి గ్రామానికి చెందిన ఇట్టం అభినయ్ (18) తండ్రి నరేష్ కుటుంబం గత కొంతకాలంగా చెరుకూరు గ్రామంలోనే ఉంటూ జీవనం కొనసాగిస్తూనారు. ఇటీవలే అభినయ్ ఇంటర్ పరీక్షలను పూర్తిచేసుకుని హాస్టల్ నుండి ఇంటికి వచ్చాడు. ఉపాధి కొరకు గ బుధవారం రాత్రి వేళలో ఇసుక తోలకాలకి వెళ్లే క్రమంలో ట్రాక్టర్ రోడ్డు పక్కన నిలిపివేసి మల విసర్జనకు వెళ్ళిన సమయంలో కన్నెబోయిన సమ్మయ్య అనే రైతు అడవి జంతువుల నుండి పంట చేను రక్షణ కోసం అమర్చిన త్రీఫేస్ లైన్ విద్యుత్ తీగలకు తగిలి విద్యుత్ ఘాతకానికి గురి అవ్వడంతో అది గమనించిన అతనితో ఉన్న మరొక స్నేహితుడు తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో తల్లిదండ్రులు విద్యుత్ ఘాతకంలో తీవ్ర గాయాలయ్యి కొట్టుమిట్టాడుతున్న బాలుడిని రక్షించి అంబులెన్స్ లో మెరుగైన వైద్యం కోసం వరంగల్ మాక్స్ కేర్ హాస్పిటల్ కు తరలించారు. ఒకవైపు పోలీస్ శాఖ, విద్యుత్ శాఖ అడవి జంతువుల కోసం విద్యుత్ తీగలు అమర్చరాదని ప్రకటనలు చేస్తూ రైతులకు అవగాహన కల్పించినప్పటికీ పట్టించుకోవడంలేదని అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించిన ఫలితం లేకుండా పోతుందని పలువురు ఆరోపిస్తున్నారు.

# తప్పుడు కథనాలు సరికాదు

- **రాంచంద్రునాయక్ పాలనలో బూత్ స్థాయి కార్యకర్తకు ప్రాధాన్యం**
- **గెలిచిన నాటి నుంచే గ్రామాల్లో అంతర్గత రోడ్ల నిర్మాణం**



**మరిపెడ, విశాలభారతి:** కాంగ్రెస్ అంటేనే పేదల పక్షపాతి అని, సబ్బండ వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం కాంగ్రెస్ పాటుపడుతోందని, నేడు ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ పాలనలో బూత్ స్థాయి కార్యకర్తకు కూడా పనులు ఇవ్వటం జరిగిందని కాంగ్రెస్ మరిపెడ మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీరా రెడ్డి అన్నారు. ప్రజల కోసం అహర్నిషలు పని చేస్తున్న ఎమ్మెల్యే పై తప్పుడు కథనాలు రాయటం సరికాదని, అక్రమాలకు అడ్డుకట్ట వేస్తున్నారన్న అక్కసుతో ఇలా రాయిస్తున్నారని ఎమ్మెల్యేపై వచ్చిన కథనాన్ని ఆయన ఖండించారు. గురువారం ఆయన మరిపెడ మునిసిపల్ కేంద్రలో ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరై తప్పడు కథనాన్ని ఖండించారు. కాంగ్రెస్ గెలిచిన నాటి నుంచే ప్రజా పాలనపై దృష్టి సారించిందని, గ్రామీణ ప్రాంతాల్లో అంతర్గత రహదారులు వేయిస్తూ అభివృద్ధికి పాటుపడుతోందన్నారు. అదే విధంగా పార్టీలోని అన్ని వర్గాల వారికి సముచిత ప్రాధాన్యత కల్పిస్తున్నారన్నారు.



# కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న మాజీ మంత్రి

**దేవరుప్పుల, విశాలభారతి**: సింగరాజుపల్లి గ్రామంలో శ్రీ కంఠమహేశ్వర స్వామి కల్యాణం,విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు.వారి వెంట బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్ గౌడ్,బిఆర్ఎస్ జిల్లా నాయకుడు పల్లా సుందర్ రాంరెడ్డి,వైస్ ఎంపిపి కత్తుల విజయ్ కుమార్ రెడ్డి,మండల బిఆర్ఎస్ నాయకులు బస్వ మల్లేశ్,చింత రవి, మైదం జోగేశ్వర్, సుడిగెల హనుమంతు, వంగ అర్జున్, మేకపోతుల ఆంజనేయులు, మేకపోతుల వెంకటేశ్వర్లు,మేక పోతుల నర్సింహా,కత్తుల సోమిరెడ్డి, కుతాటి నర్సింహులు తదితరులున్నారు.



# భవిష్యత్ లో మరిన్ని మెడల్స్ సాధించాలి

**- వడ్డేపల్లి రాజేశ్వర్ రావు**

**కూకట్ పల్లి, విశాలభారతి** :థాయ్‌లాండ్‌లో మార్చి 10 17, సఫాన్ హిన్ స్టేడియంలో నిర్వహించిన వరల్డ్ జీత్ కునే దో స్పోర్ట్స్ కౌన్సిల్‌లో 6వ అంతర్జాతీయ థాయ్ మార్షల్ ఆర్ట్స్ గేమ్స్ లో పూర్తి కాంటాక్ట్ ఫైట్‌లో గోల్డ్ మెడల్ సాధించిన మిస్టర్ రైలా విశాల్ ను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర్ రావు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాల్ గోల్డ్ మెడల్ సాధించి హైదరాబాద్ నగరానికి పేరు తెచ్చారని, భవిష్యత్ లో మరిన్ని మెడల్స్ సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ఇప్ప రవీందర్, సంతోష్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

# ఆరూరి రమేష్ గెలవడం నల్లేరు మీద నడకే

- **బీజేపీ జనగామ జిల్లా అధికార ప్రతినిధి చింత సృజన్ కుమార్**



**దేవరుప్పుల, విశాలభారతి**: కాంగ్రెస్, బీ ఆర్ యస్ పార్టీలు రెండు రెండే కనీసం ఓటు అడిగే అర్హత లేదు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రాగానే 200000 లక్షల రుణ మాఫీ చేస్తా అన్నారు.100 రోజులలో 6 గారంటీలు అమలు చేస్తాం అన్నారు ఎక్కడ జరిగినయి కనీసం ఈ ప్రభుత్వం రైతుల పొలాలకు నీళ్ళు అందిచక పంట పొలాలు ఎండిపోతుంటే కనీసం రైతులను పట్టించుకునే నాధుడు లేడు పార్లమెంట్ ఎన్నికలలో ఓట్లు అడిగితే రైతులే తగిన బుద్ధి చెప్పుతారు ఇక బీ ఆర్ యస్ గతంలో తొమ్మిదిన్నర, సంవస్సారాలు పాలించి ప్రజా ధనాన్నీ సర్వ నాశనం చేసినారు విల్లు పెట్టిన స్కీంలు అన్ని స్కాంలే ఇవ్వల కల్వకుంట్ల కవిత ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో ప్రధాన పాత్ర పోషించి తీహార్ జైలులో ఉసలు లెక్క పెడుతుంది,ఒక చిన్న ఉదాహరణ కాళేశ్వరం పేరుతో లక్షల కోట్లు సంపాదించుకున్న వారు సహితం ఇంకా ముందు ముందు జైలుకు పోయే పరిస్థితి వస్తది తప్పు చేసినప్పుడు తగు మూల్యం చెల్లించక తప్పదు ఇవి గల్లీ ఓట్లు కాదు ఢిల్లీ ఓట్లు అని ప్రజలే చెప్తున్నారు ఇక బీ ఆర్ యస్ పార్టీని ఇక ఎవరు కాపాడ లేరు. బీజేపీ పార్టీ కేంద్రంలో శ్రీ భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ 10 సంత్సరాల కాలంలో ఒక చిన్న మచ్చ లేని అవినీతి రహిత ప్రభుత్వాన్ని నడపడంమే కాకుండా శాంతి భద్రతల లోపం లేకుండా ప్రపంచంలో అగ్ర దేశాలు సహితం ఈ రోజు భారత్ వైపు చూసే విధంగా చేసిన ఘనత మోడీది ఇవ్వల ఎక్కడ పోయిన జనం అట్టున్నరు ఈ సారి పార్లమెంట్ కి నా ఓటు మోడీకే యువ ఓటర్లు సహితం బీజేపీ కే నా ఓటు అంటున్నారు.




# ఏప్రిల్ 1 నుండి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

- **రైతులు, నిర్వాహకులకు అవగాహన కల్పించండి**
- **అన్ని కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి**
- **జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావ్**

**సూర్యాపేట, విశాలభారతి:** యాసంగిలో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించే ప్రక్రియ పకడ్బందీగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ అనుబంధ శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎక్కడ కూడా ఇబ్బందులు తలెత్తకుండా నిర్దిష్ట ప్రణాళికతో ముందుకెళ్లాలని సూచించారు. యాసంగి వరి ధాన్యం కొనుగోళ్ళకు సంబంధించి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో గురువారం ఆయా శాఖల అధికారులు , పి ఎసి ఎస్ చైర్మన్లు, సీఈఓలు, ఐకెపి అధికారులు, సీసీలు, మెప్మా ప్రతినిధులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ముందుగా ఏప్రిల్ 01 వ తేదీ నుండి ప్రతి మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులకు అందుబాటులో ఉంచేలా అన్ని చర్యలు తీసుకున్నామని ఆదేశించారు. జిల్లాలో యాసంగిలో 3.82.545 విస్తీర్ణంలో వరి పండించారని, 8.62,617 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి చేతికందుతుందని అంచనా వేశామన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఈసారి జిల్లాలో 236 కొనుగోలు కేంద్రాల ద్వారా 3.55 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించామని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బి.ఎస్. లత, డిఎస్ఓ మోహన్ బాబు, డిఆర్ డిఓ మధుసూదన్ రాజు, ఐకేపీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# రైతులను ఆదుకోకపోతే ఉద్యమిస్తాం

**నకిరేకల్, విశాలభారతి:** కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నదని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. నార్కెట్‌పల్లి మండలం చిన్న నారాయణపురం గ్రామంలో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి ఎండిన పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల తో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గత పదేళ్లుగా పంటలు సాగు చేస్తున్న ఎన్నడు సాగునీరు లేక పంటలు ఎండిపోలేదని, ఈ ఏడాది పంట చేతికందే దశలో నీళ్లు లేక పశువులను మేపుతున్నామని రైతులు వాపోయారు ఎకరానికి రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టి నష్టపోయామని, ప్రభుత్వం ఆదుకోవాలంటూ రైతులు కోరుతున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఒక్కరోజు కూడా సాగునీరు రాలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని, లేనిపక్షంలో రైతుల పక్షాన ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు రూ. రెండు లక్షల రుణ మాఫీ, ఎకరానికి రూ.15 వేల రైతుబంధు ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 100 రోజులైనా రుణమాఫీ ఊసేలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయం మాజీ చైర్మన్ రేగట్టే మల్లికార్జున్ రెడ్డి, నార్కట్ పల్లి ఎంపీపీ సూది రెడ్డి నరేందర్ రెడ్డి,బిఆర్ఎస్ పార్టీ రైతు విభాగం అధ్యక్షుడు యనాల అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# వైఎస్ హయాంలోనే బేడ బుడగ జంగాలకు న్యాయం

- బుడగ జంగం హక్కు దండు రాష్ట్ర అధ్యక్షులు తూర్పాటి హనుమంతు

**రామన్నపేట, విశాలభారతి:** ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నపుడు బేడ బుడగ జంగాలకు న్యాయం చేశారని గుర్తు చేశారు. గురువారం నాడు ఆయన రామన్నపేట మండలంలో వివాహ వేడుకకు హాజరై అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి గా ఉన్నపుడు కులం సర్టిఫికెట్ ఆర్డీఓ ద్వారా కాకుండా ఎంఆర్వో ద్వారా ఇచ్చేవిధంగా జీఓ పాస్ చేయించాడని తెలిపారు. దాని వల్ల మా సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులు ఫీజు రీయింబర్స్ మెంట్ ద్వారా చదువుకొని ఉద్యోగాలు సంపాదిస్తున్నారు. అని అన్నారు. ఆ తర్వాత వచ్చిన ఏ ప్రభుత్వం మాకు న్యాయం చేయలేదని అన్నారు. ఇప్పుడిప్పుడే బుడగజంగాల్లో చైతన్యం పెరుగుతుందని బుడగజంగాలు అన్ని రంగాల్లో రాణించాలని ప్రభుత్వం గుర్తించి బుడగ జంగాలకు అసెంబ్లీ,పార్లమెంటు స్థానాల్లో కూడా అవకాశాలు కల్పించాలని కేంద్ర రాష్ట్ర ఫలాలు బుడగ జంగాలకు కూడా అందాలని లేనియెడల రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని తెలియజేశారు. మా సామాజిక వర్గానికి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మోతే వెంకటేష్, మోతే యాదగిరి, ముగ్గు నరసింహ, చల్ల గంగ రాజు, కళ్లెం నరసింహ తదితరులు పాల్గొన్నారు.



# బార్ అసోసియేషన్ అధ్యక్షుడుగా నూకల సుదర్శన్ రెడ్డి

**సూర్యాపేట, విశాలభారతి:** బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గా నూకల సుదర్శన్ రెడ్డి ఎన్నిక అయ్యారు. గురువారం సూర్యాపేట బార్ అసోసియేషన్ ఎన్నికలు హోరా హోరిగా జరిగాయి. ఇద్దరి మధ్య హోరహోరి గా జరిగిన పోటీ లో న్యాయవాది జటంగి వెంకటేశ్వర్లు పై 24 ఓట్లు అధిక్యం పై నూకల సుదర్శన్ రెడ్డి గెలుపొందారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులుగా ఎం.ఎన్ వరప్రసాద్ కు 120 ఓట్లు రాగా సమీప అభ్యర్థి మురళి కి 51 ఓట్లు వచ్చాయి. 69 ఓట్ల మెజారిటీ తో వరప్రసాద్ గెలిచారు. ప్రధాన కార్యదర్శి గా డి.మల్లయ్య గెలుపొందారు. సంయుక్త కార్యదర్శి గా పి. వాణి కోశాధికారి గా డి. వీరేష్ కుమార్ గ్రంథాలయ కార్యదర్శి గా మొహమ్మద్ అబద్దుల్ లతీఫ్, క్రీడలు, సంస్కృతిక కార్యదర్శిగా జె. చంద్రమౌళి కార్యవర్గ సభ్యులు గా చంద్రమౌళి, సుంకర రవి, డి. వెంకట్ రెడ్డి,కె. వెంకటేశ్వర్లు తదితరులు ఎన్నికయ్యారు. సూర్యాపేట బార్ సోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన నూకల సుదర్శన్ రెడ్డిని కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొప్పుల వేణా రెడ్డి, పోలబోయిన నరసయ్య యాదవ్, ఇతర న్యాయవాదులు అభినందించి ఘనంగా సన్మానించారు.

# అక్రమాల బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

- జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టిన చైర్మన్, డైరెక్టర్లు



**సూర్యాపేట, విశాలభారతి**: నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి సహకార సంఘంలో ధాన్యం కొనుగోలు విషయంలో మాజీ చైర్మన్ రెండు కోట్ల రూపాయలకు పైగా అక్రమాలకు పాల్పడిన విషయంలో ఇంతవరకు చర్యలు ఎందుకు తీసుకోలేదని చిల్లెపల్లి సహకార సంఘం ప్రస్తుత చైర్మన్ మలిగిరెడ్డి రమణారెడ్డి, డైరెక్టర్లు మలిగిరెడ్డి హేమలత, పెరువాల రంగారెడ్డి, పల్లా వెంకన్న, ముత్తమ్మ, గోవిందు తదితరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సూర్యాపేట జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద వారు నిరసన చేపట్టిన సందర్భంగా మాట్లాడారు. 2020 21 సంవత్సరానికి గాను ఐకెపిల ద్వారా దాన్యం కొనుగోలు చిల్లేపల్లి సహకార సంఘ పరిధిలో చేపట్టాల్సి ఉండగా నాటి సంఘ చైర్మన్, సీఈవో, మిల్లు యజమానులు కుమ్మక్కై వేరే ప్రాంత రైతుల పేర్ల ట్రక్ సీట్లు, బిల్లులు తయారుచేసి కొన్నట్టుగా ఎలాంటి దాన్యం కొనుగోలు జరపకుండానే రెండు కోట్ల రూపాయలను స్వాహా చేశారని వారు ఆరోపించారు. చిల్లేపల్లితో పాటు మాజీ చైర్మన్ కొన్నట్టుగా ఆ ప్రాంతంలో వ్యవసాయ శాఖ అధికారులు చెప్పిన ప్రకారం రైతులు సన్నరకం దాన్యం పండించారని, అయితే అక్రమాలకు పాల్పడ్డ మాజీ చైర్మన్ మాత్రం దొడ్డు ఒడ్లు కొన్నట్టు రికార్డులలో చూపించారని, రైతులు సన్న ఓడ్లు పండిస్తే దొడ్లు వడ్లు ఎలా కొంటారని వారు అనుమానాలు వ్యక్తం చేశారు.



# మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడుదాం

- ఏపూరి లో జరిగే భగత్ సింగ్ 93వ వర్ధంతి సభను జయప్రదం చేయండి
- పిడిఎస్యు జిల్లా ఉపాధ్యక్షులు పిడమర్తి భరత్

**నూతనకల్, విశాలభారతి**: మండలంలో భగత్ సింగ్ 93వ వర్ధంతి సందర్భంగా మార్చి 29న ఏపూర్ లో జరిగే సభను జయప్రదం చేయాలని కరపత్రం ఆవిష్కరించారు . సందర్భంగా పిడిఎస్యు జిల్లా ఉపాధ్యక్షులు పిడమర్తి భరత్ పాల్గొని మాట్లాడుతూ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ లు బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, భారతదేశ విముక్తి కోసం, స్వేచ్ఛా స్వాతంత్ర్యం కోసం తమ విలువైన ప్రాణాలను భారత జాతికి అంకితం ఇచ్చారు. ఉరితాడును ముద్దాడి అమరులయ్యారు. భగత్ సింగ్,రాజ్ గురు, సుఖ్ దేవ్ ల స్పూర్తితో యువత యువజన పోరాటాలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పిడిఎస్యు నాయకులు వేంకటేష్, మనోజ్ శివ, గోపి, బన్నీ, గణేష్,తదితరులు పాల్గొన్నారు.

# మురుగు నీటి శుద్ధి వల్ల అనేక ప్రయోజనాలు

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



**కూకట్ పల్లి, విశాలభారతి:** కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బాలాజీ నగర్ డివిజన్ రెయిన్బో విస్తా వద్ద నిర్మిస్తున్న ఎస్టీపీ ప్లాంట్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ అధికారులతో మాట్లాడుతూ త్వరిత గతిన పనులు పూర్తి చేయాలని, అలాగే ఏమైనా స్థలం విషయంలో కానీ ఇతర ఇబ్బందులు ఉన్నా కూడా తమ దృష్టికి తీసుకురావాలని దీనికి సంబంధించి మాట్లాడి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఎస్టిపి ప్లాంట్ల వల్ల నియోజక వర్గంలోని మురుగునీరు శుద్ధి చేసి మంచినీరు వదిలే విధంగా ఉపయోగపడతా యని, దీని వల్ల ప్రజల ఆరోగ్యానికి మేలు కలగడమే కాకుండా పర్యావరణానికి కూడా ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారా యణ, మాజీ కార్పొరేటర్ పగుడాల బాబూరావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికలు విజయవంతంగా నిర్వహించాలి

- మూడు జిల్లాల అధికారులు సమన్వయంతో పని చేయాలి
- జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావు



**సూర్యాపేట, విశాలభారతి:** లోక్ సభ ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించడానికి తమ పూర్తి సహకారం అందిస్తామని జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావు తెలిపారు. గురువారం నల్గొండ జిల్లా దామరచర్ల మండలం వాడపల్లిలో ఉన్న ఇండియన్ సిమెంట్స్ సమావేశ మందిరంలో అంతర్రాష్ట్ర సరిహద్దు సమన్వయ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో పల్నాడు జిల్లా అధికారులు తమ పూర్తి సహకారాన్ని అందించారని వారికి ధన్యవాదాలు తెలిపారు. అదే విధంగా లోక్ సభ ఎన్నికలకు సూర్యాపేట జిల్లా అధికారులు కూడా తమ సహకారాన్ని అందిస్తామని కలెక్టర్ తెలిపారు. ఇంటిగ్రేటెడ్ చెక్ ఫోస్ట్ లలో 8 శాఖల అధికారులు విధులు నిర్వహిస్తున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. ఎఫ్ ఎస్ టి, ఎస్ ఎస్ టి వాహనాలకు 360 డిగ్రీస్ కెమెరాలను అమర్చడం జరిగిందని దీనిని కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. నగదు, మద్యం, మత్తు, పదార్థాలు వాటి అక్రమ రవాణాను అడ్డుకునేందుకు అంతర్రాష్ట్ర సరిహద్దు వద్ద నిఘాను పకడ్బందీగా ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెలుసుకునే విధంగా వాట్సాప్ గ్రూపు ను ఏర్పాటు చేయడమే కాకుండా తెలిసిన సమాచారాన్ని వెంటనే వాట్సాప్ లో పెడుతూ ఉండాలని కలెక్టర్ తెలిపారు. రెండు జిల్లాల అధికారుల సహకారంతో గత ఎన్నికల్లో మంచి ఫలితాలను సాధించామని, ఈ ఎన్నికల్లో కూడా పూర్తి సహకారం అందించాలన్నారు . జిల్లా ఎస్పీ రాహుల్ హేగ్డే మాట్లాడుతూ జిల్లాలో నాలుగు బోర్డర్స్ లలో చెక్ పోస్ట్ లలో ఏర్పాటు చేయడమైనది, అన్ని చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కంట్రోల్ రూమ్ ద్వారా పరివేక్షణ చేయడం జరుగుతుందని తెలిపారు. ఎక్కడ కూడా ఫెర్రీకి పర్మిషన్ ఇవ్వడంలేదని అలాగే ప్రైవేట్ బోట్స్ ని కూడా నియంత్రించాలని పల్నాడు జిల్లా అధికారులకు సూచించారు. కొన్ని రకాల మద్యం రేట్లు తెలంగాణ రాష్ట్రంలో ఆంధ్ర రాష్ట్రం కంటే తక్కువగా ఉన్నాయని వీటిని రాష్ట్ర సరిహద్దులలో నిల్వలు చేయకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటివరకు 1 కోటి 91 లక్ష రూపాయలు సీజ్ చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్గొండ కలెక్టర్ దాసరి హరిచందన, పల్నాడు కలెక్టర్ శివ, నల్గొండ ఎస్పి చందనం దీప్తి,ఆదనపు కలెక్టర్లు, నోడల్ ఆదికారులు పాల్గొన్నారు.




# పేద విద్యార్థులకు బట్టలు పంపిణీ

**పినపాక, విశాలభారతి :** పేద విద్యార్థులకు బట్టలు అందజేయడం ఎంతో సంతోషంగా ఉందని తోగ్గూడెం పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.నరేష్ అన్నారు. గురువారం పినపాక మండలంలోని తోగ్గుడెం గ్రామంలోని జి.యస్.యస్ డే కేర్ సెంటర్ లోని గ్రేస్ సర్వీస్ సొసైటీ వారి ఆధ్వర్యంలో 80 మంది పేద విద్యార్థులకు బట్టలు పంపిణి చేశారు.ఈ సదర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి,పాఠశాలకు,గ్రామానికి మంచి పేరు తీసుకరావాలని కోరారు.గ్రేస్ సర్వీస్ సొసైటీ సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో నిర్వహించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో చైల్డ్ కేర్ సెంటర్ ఇంఛార్జి బడే. సాగర్ సంస్థ ప్రతినిధులు మురళీ కృష్ణరెడ్డి,సతీష్,డే కేర్ సెంటర్ టీచర్ మైపా.రమాదేవి,ఆయా కాంతమ్మ, గ్రామస్తులు తదితరులు పాల్గోన్నారు.




# ఘనంగా బేతెస్థ ప్రార్థన మందిరం 14 వ వార్షికోత్సవం

**సూర్యాపేట, విశాలభారతి:** జిల్లా కేంద్రం లోని స్థానిక కుప్పిరెడ్డిగూడెం 10వ వార్డు, సూర్యాపేట నందు బేతెస్థ ప్రార్థన మందిరం 14 వ వార్షికోత్సవం గురువారం పాస్టర్ సిరిపంగి జార్జి నవనీత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య ప్రసంగికులు బేతెస్థ మినిస్ట్రీస్సూర్యాపేట వ్యవస్థాపక అధ్యక్షులు బిషప్ దుర్గం ప్రభాకర్ కరుణ శ్రీ, పాస్టర్ జైపాల్ గుంటూరు పాల్గొని దైవసందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమం లో ఆర్చ్ బిషప్ యం. పి. హెచ్. హెచ్.మోజెస్ పాల్గొని క్రీస్తూ బోధనలు ప్రవచనాలు చెప్పినారు. అనంతరం 200 మంది క్రైస్తవ భక్తులకు ప్రేమ విందు ఏర్పాటు చేశారు, ఈ కార్యక్రమంలో చార్లెట్ హోం ఆనాధ ఆశ్రమం వ్యవస్థాపకులు బ్రదర్ జాటోత్ డేవిడ్ రాజు,సూర్యాపేట నియోజకవర్గం పెలోషిఫ్ అధ్యక్షులు రెవ. డా. జలగం జేమ్స్,చివ్వేంల మండలం అధ్యక్షులు పాస్టర్ గుగులోత్ బాలాజీ నాయక్,సూర్యాపేట రూరల్ మండలం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్పుల క్రిష్టఫర్,ఆర్కెస్ట్ర పాస్టర్ కొమ్ము హోసన్నా, పాస్టర్ చిలుముల జార్జి తదితరులు పాల్గొన్నారు.

# పెంచిన టెట్ పరీక్ష ఫీజు తగ్గించాలి

- నిరుద్యోగులపై ఆర్థిక భారం మోపడం సరైనది కాదు
- ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఈనపల్లి పవన్ సాయి



**అశ్వాపురం, విశాలభారతి**: టెట్ పరీక్ష అధికంగా పెంచడం వల్ల నిరుద్యోగులపై పెనుబారం పడుతుందని. ప్రభుత్వం తక్షణమే టెట్ పరీక్ష ఫీజులు తగ్గించాలని, ఏఐఎస్ఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సహాయ కార్యదర్శి, ఈనపల్లి పవన్ సాయి డిమాండ్ చేశారు. గురువారం అశ్వాపురం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గతంలో ఒక పేపర్ రాస్తే రూ.200లు ఉండేది రెండు పేపర్లు రాస్తే రూ.300లు ఉండేది. కానీ ఇప్పుడు ఒక పేపర్ రాస్తే రూ.1000లు రెండో పేపర్ రాస్తే రూ.2000లు ఫీజు పెట్టడం సరికాదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రవేశపెట్టిన పరీక్షల ఫీజులు తగ్గించి తక్కువ ఫీజులతో పోటీ పరీక్షలు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. కానీ ఎన్నికల హామీలకు విరుద్ధంగా టెట్ పరీక్షకు అధిక ఫీజు పెట్టడం సరికాదన్నారు. లక్షలాదిమంది నిరుద్యోగులు టెట్ పరీక్షకు సన్నద్ధమవుతున్నారని ఇప్పటికే బిఆర్ఎస్ ప్రభుత్వంలో అధిక ఫీజులు కట్టి కోచింగ్ తీసుకొని పరీక్షల్లో అవకతవకల వల్ల నిరుద్యోగులు ఆర్థిక భారంతో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



# ఎమ్మెల్యే వాహనాన్ని తనిఖీ చేసిన ఎన్నికల అధికారులు

**పినపాక, విశాలభారతి** : ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కారును గురువారం పోలీసులు, ఎన్నికల టీం అధికారులు ఈ.బయ్యారం చెక్ పోస్ట్ వద్ద తనిఖీ చేశారు. మణుగూరు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుంచి పినపాక మండలానికి తన వాహనంలో ఎమ్మెల్యే వస్తుండగా ఈ బయ్యారం క్రాస్ రోడ్డు వద్ద ఎన్నికల అధికారులు నిలిపి క్షుణ్ణంగా తనిఖీ నిర్వహించారు. పోలీసు అధికారులు, సిబ్బందికి ఎమ్మెల్యే సహకరించారు. పోలీసుల విధులకు, ఎన్నికల డ్యూటీలో ఉన్న అధికారులకు ఎటువంటి ఆటంకం కలగకుండా వాహన తనిఖీకి ఎమ్మెల్యే పాయం సహకరించారు. పోలీసుల పనితీరుపై ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు. వారికి అభినందనలు తెలిపారు. ఇదే స్పూర్తితో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, సజావుగా పూర్తయ్యేలా చూడాలని సూచించారు.



# సోషల్ మీడియా ప్రచారం పై నిఘా పెంచాలి

- సోషల్ మీడియా ట్రాకింగ్ కేంద్రం ప్రారంభం
- సోషల్ మీడియా ముందస్తు అనుమతులు తప్పని సరి
- జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ఎస్ వెంకట్రావ్.

**సూర్యాపేట, విశాలభారతి:** జిల్లాలో లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలు, వార్తలపై గట్టి నిఘా పెంచామని జిల్లా ఎన్నికల అధికారి , కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ అన్నారు. గురువారం కలెక్టరేట్ నందు సోషల్ మీడియా ట్రాకింగ్ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ బి.ఎస్. లత తో కలసి ప్రారంభించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక మాద్యమాలైన ఫేస్బుక్, ఇన్ స్ట్రాగామ్, వాట్సప్, యూ ట్యూబ్, ట్విట్టర్ తదితర సామాజిక మాద్యమాల్లో ప్రచారం ఎక్కువగా వస్తున్నందున ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఏర్పాటు చేసిన కేంద్రం ద్వారా సోషల్ మీడియా ఐటమ్స్ పై ఎప్పటికప్పుడు ట్రాకింగ్ చేస్తూ తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. తదుపరి ఏర్పాటు చేసిన కేంద్రం ద్వారా ముందుగా అనుమతులు పొందాలని కలెక్టర్ సూచించారు. ఫిర్యాదుల కేంద్రం నుంచి యంత్రాంగం ఇం టర్నెట్ బేస్డ్ మీడియాలలో వచ్చే ఎన్నికల ప్రచారాలపై పర్యవేక్షణ చేయడం జరుగుతుందని వివరిం చారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై సోషల్ మీడి యాలో వచ్చే వాటిని పరిశీలనలో తీసుకొని చర్యలు తీసు కుంటామని తెలిపారు. తదుపరి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సిఇఓ అప్పారావు, డిపిఆర్ఓ రమేష్ కుమార్, డిఈ మల్లేశం, ఏఓ సుదర్శన్ రెడ్డి, ఎన్నికల పర్యవేక్షకులు శ్రీనివాస రాజు, సోషల్ మీడియా ట్రాకింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రసన్నాంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలలో పాల్గొన్న ఉప్పల శ్రీనివాస్ గుప్తా

**ఎల్బీనగర్, విశాలభారతి:** రామకృష్ణాపురంలోనే శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో గురువారం 50వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ బ్రహ్మోత్సవాలకు తెలంగాణ రాష్ట్ర మాజీ పర్యాటక చైర్మన్ ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస్ గుప్త ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీ ప్రసన్నాంజనేయ స్వామికి ఉప్పల శ్రీనివాస్ గుప్తా ప్రత్యేక పూజలు చేశారు.









# ఓయూలో ఘనంగా ముగిసిన జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్

- విజేతలకు బహుమతులు ప్రదానం
- అనుభవాలు పంచుకొని సూచనలు సలహాలు చేసిన సినీ ప్రముఖులు

**సికింద్రాబాద్, విశాలభారతి:** ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల జర్నలిజం విభాగం విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్ "జషన్ ఎ సైన్మా " సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యార్థుల ఆటపాటలు కేరింతల నడుమ గురువారం ఘనంగా ఠాగూర్ ఆడిటోరియంలో ముగిశాయి. పలు ప్రాంతాల నుంచి వచ్చిన షార్ట్ ఫిల్మ్స్ లో ఉత్తమమైన వాటికి నిర్వాహకులు బహుమతులు అందించారు. సినీ ప్రముఖుల చేత జరిపిన వర్క్ షాప్, ప్యానెల్ డిస్కషన్ ద్వారా సినీ ఔత్సాహికులకు ఫిల్మ్ మేకింగ్ పై అవగాహన కల్పించారు. సౌండ్ డిజైన్ & సింక్ సౌండ్ పై జరిగిన వర్క్ షాప్ లో ఇండీ ఫిల్మ్ మేకర్స్, శీష్ మహల్ ఫేమ్ రోహిత్ శశి, సౌండ్ డిజైనర్ స్వప్నిక్ రావ్ పాల్గొని నూతన దర్శకులతో తమ అనుభవాలను పంచుకున్నారు. విజువల్స్ తో సమానంగా సౌండ్ కి ప్రాముఖ్యత ఇవ్వాలని శశి సూచించారు. సింక్ సౌండ్ టెక్నిక్ తో సినిమా చేస్తున్నప్పుడు సౌండ్ ని నేరుగా కెమెరాలో కాకుండా సౌండ్ రికార్డర్స్ లో నిక్షిప్తం చేయాలని అన్నారు. నూతన దర్శకులు కాస్ట్యూమ్స్ వంటి వాటికన్నా సౌండ్ మీద ఖర్చు పెట్టాలని రోహిత్ సూచించారు. ఆరంభంలో కనీసం ఒకటి రెండు సినిమాలకు సౌండ్ టెక్నీషియన్స్ తో పని చేస్తే ఎంతో నేర్చుకోవచ్చని, ఎన్నో నూతన ఐడియాలు వస్తాయని సూచించారు. సింక్ సౌండ్ తో సినిమా చెయ్యడానికి మంచి నటులు ఎంతో ముఖ్యమని, మన దగ్గర నాటకాల సంస్కృతి లేనందువల్ల మంచి నటుల కొరత ఉందని శశి అభిప్రాయపడ్డారు. ఒక మహిళగా ఇండస్ట్రీ లోకి అడుగుపెట్టడం, అవకాశాలు అందుకొని రాణించడం అంత సులువు కాదని పుష్ప అన్నారు. ముందుగానే ఏదైనా ఆదాయ వనరు పెట్టుకోవాలని సూచించారు. మహిళలతో పని చేసేందుకు మగవారింకా పూర్తి సంసిద్ధంగా లేరని అన్నారు. ఇండస్ట్రీ లోకి అడుగుపెట్టేందుకు ఇదే సరైన సమయమని, నిర్మాతలు ఇప్పుడు స్త్రీ పురుష బేధం లేకుండా ప్రతిభ ఆధారంగా అవకాశాలు ఇస్తున్నారని ఉమ చెప్పారు. పనిని ఒక ప్రొఫెషనల్ గానే చేయాలని, తాను ఒక మహిళ అని మనసులోంచి తీసేయాలని సాజిదా సూచించారు. కార్యక్రమంలో భాగంగా తెలంగాణ భాష, సాంస్కృతిక విభాగం నుంచి పలువురి కళాకారుల పేరిణి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమాల అనంతరం టీజర్ కట్, న్యాచురల్ షార్ట్ ఫిల్మ్, కల్చర్ ఓపెన్ మైక్ లాంటి పోటీలో గెలుపొందిన విజేతలకు బహుమతులకు విభాగం హెడ్ ప్రో.టి.సతీష్ కుమార్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డా.రామస్వామి, విద్యార్థులు శ్యాముల్ రాజ్, గౌరవ్, హేమంత్, రాకేష్, దివ్య, ధరణి, శ్రీజ, సౌమ్య, పవన్ శ్రీనివాస్, వినోద్ పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

సినిమా
www.vishalabharati.com
epaper:vishalabharati.com

7

శుక్రవారం,
29.03. 2023
హైదరాబాద్

vishalabharathi Telugu Daily

# టిల్లు స్క్వేర్ థియేటర్లలో నవ్వులు పూయిస్తుంది



ఈమధ్య కాలంలో తెలుగు ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్న సీక్వెల్ అంటే 'టిల్లు స్క్వేర్' అని చెప్పవచ్చు. స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటించిన 'డీజే టిల్లు' ఎంతటి విజయాన్ని సాధించిందో తెలిసిందే. ఈ చిత్రం యువత మరియు సినీ ప్రియుల్లో కల్ట్ ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది. దాంతో ఈ చిత్రానికి సీక్వెల్ గా వస్తున్న 'టిల్లు స్క్వేర్'పై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. పాటలు, ప్రచార చిత్రాలు ఆ అంచనాలను రెట్టింపు చేశాయి. 'టిల్లు స్క్వేర్' చిత్రానికి సిద్ధు జొన్నలగడ్డ కథనం, సంభాషణలు అందించగా.. మల్లిక్ రామ్ దర్శకత్వం వహించారు. అనుపమ పరమేశ్వరన్ కథానాయికగా నటించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్,ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మించారు. 'డీజే టిల్లు'కి మించిన వినోదాన్ని అందించడానికి 'టిల్లు స్క్వేర్' చిత్రం మార్చి 29న ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో గురువారం మీడియాతో ముచ్చటించిన కథానాయకుడు సిద్ధు జొన్నలగడ్డ సినిమాకి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. డీజే టిల్లు సమయంలో ప్రేక్షకుల్లో అంచనాల్లేవు. హీరో పాత్ర ఎలా ఉంటుంది అనేది ముందు తెలీదు. అందుకే ఆ పాత్రను చూసి ప్రేక్షకులు సర్ ప్రైజ్ అయ్యారు. ఇప్పుడు అదే పాత్రతో మరోసారి మ్యాజిక్ చేయాల్సి రావడంతో కాస్త ఒత్తిడి ఉండటం సహజం. అయితే ఒత్తిడిని జయించి మెరుగైన అవుట్ పుట్ ని అందించడానికి కృషి చేశాం. రెండింటికి కొనసాగింపుగా ఉంటుంది. పాత్ర కొనసాగింపు పూర్తి స్థాయిలో ఉంటుంది. కథ కొనసాగింపు కూడా కొంత ఉంటుంది కానీ.. అది పాత కథను గుర్తుచేస్తూ కొత్త అనుభూతిని ఇస్తుంది. టిల్లు పాత్ర కూడా సీక్వెల్ లో ఇంకా ఎక్కువ ఎనర్జిటిక్ గా ఉంటుంది. ఎందుకంటే ఈసారి ఇంకా పెద్ద సమస్యలో ఇరుక్కుంటాడు. ఆ సమస్య ఏంటి అనేది ఇప్పుడే చెప్పను. థియేటర్ లో చూసి ఎంజాయ్ చేస్తారు. చాలా సర్ ప్రైజ్ లు, షాక్ లు ఉంటాయి. సినిమా అంతా నవ్వుకుంటూనే ఉంటారు. టిల్లు ఎక్కడా నవ్వడు.. కానీ అందరినీ ఫుల్ గా నవ్విస్తాడు. కథలో ఏ పాత్రకు ఉండాల్సిన ప్రాధాన్యత ఆ పాత్రకు ఉంటుంది. డీజే టిల్లులో కూడా హీరో, హీరోయిన్ రెండు పాత్రలకు ప్రాధాన్యత ఉంటుంది. ఇప్పుడు టిల్లు స్క్వేర్ కూడా అలాగే ఉంటుంది. హీరో పాత్ర లేకపోతే హీరోయిన్ పాత్ర పండదు, అలాగే హీరోయిన్ పాత్ర లేకపోతే హీరో పాత్ర పండదు. సినిమాకి ఎంత అవసరమో అంత ఉంచాము. కామెడీ సినిమా కాబట్టి ఎక్కువ నిడివి లేకపోతేనే ఎక్కడా బోర్ కొట్టించకుండా ప్రేక్షకులను పూర్తిస్థాయి వినోదాన్ని అందించగలం.

# ఫ్యామిలీ స్టార్ ట్రైలర్ రిలీజ్



స్టార్ హీరో విజయ్ దేవరకొండ నటిస్తున్న "ఫ్యామిలీ స్టార్" సినిమా ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని హైదరాబాద్ మూసాపేటలోని శ్రీరాములు థియేటర్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిత్ర నిర్మాత దిల్ రాజు. దర్శకుడు పరశురామ్ పెట్ల పాల్గొన్నారు. ప్రేక్షకుల సందడి మధ్య "ఫ్యామిలీ స్టార్" సినిమా ట్రైలర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు పరశురామ్ పెట్ల మాట్లాడుతూ - "ఫ్యామిలీ స్టార్" సినిమా గురించి నేను ఒక్కటే మాట చెప్పదలుచుకున్నాను. ఈ సినిమాను, హీరో విజయ్ దేవరకొండ, హీరోయిన్ మృణాల్ ఠాకూర్ ను ప్రతి తెలుగు ప్రేక్షకుడు, ప్రతి తెలుగు కుటుంబం కొన్నేళ్ల పాటు గుర్తుంచుకుంటారు. ఈ సినిమాను ఏప్రిల్ 5న థియేటర్స్ లో హాయిగా చూడండి. ఐ ఫీస్ట్ లాంటి సినిమా ఇది. విజయ్, మృణాల్ క్యారెక్టర్స్, విజువల్స్, మ్యూజిక్, ఎమోషన్, ఎంటర్ టైన్ మెంట్ ..వంటి అన్ని అంశాలు మీకు నచ్చేలా ఉంటాయి. థియేటర్ లో మిమ్మల్ని కలుస్తాను. అన్నారు. నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ - ఫ్యామిలీ స్టార్ సినిమా గురించి ఈ మధ్య చిన్న హింట్ ఇచ్చాను. తన కుటుంబాన్ని పైకి తీసుకొచ్చేందుకు ప్రయత్నించే ప్రతి వ్యక్తి ఫ్యామిలీ స్టార్ అని చెప్పడమే ఈ సినిమా కథాంశం. మీలోనూ ఫ్యామిలీ స్టార్స్ ఉంటారు. లేకపోతే ఈ సినిమా చూశాక ఫ్యామిలీ స్టార్ అవ్వాలని కోరుకుంటారు. ఇంకా ఏడు రోజులు మాత్రమే ఉన్నాయి సినిమా రిలీజ్ కు మేము ఇదే శ్రీరాములు థియేటర్ లో మార్నింగ్ షో చూసేందుకు ఏప్రిల్ 5న వస్తాం. ఆ రోజు థియేటర్ లో మీ అందరూ నవ్వుతూ సినిమా చూస్తుంటారు. గీత గోవిందం తర్వాత పరశురామ్, విజయ్ కలిసి వర్క్ చేస్తున్నారు. ఈ సినిమాలో విజయ్ క్యారెక్టర్ ను క్లాస్, మాస్, యూత్ ఫుల్, ఎంటర్ టైనింగ్, ఎమోషన్ తో పరశురామ్ డిజైన్ చేశాడు. విజయ్ క్యారెక్టర్ చాలా స్పెషల్ గా ఉంటుంది. పరశురామ్ సినిమాల్లో లైటర్ వేన్ కామెడీ ఆకట్టుకునేలా ఉంటుంది. ఈ సినిమాలోనూ అదే తరహాలో నవ్విస్తాడు. సమ్మర్ లో ఫ్యామిలీ స్టార్ మిమ్మల్ని బాగా ఆకట్టుకుంటుంది. 21 ఏళ్ల కిందట ఏప్రిల్ 5న దిల్ సినిమాతో నేను నిర్మాతగా దిల్ రాజుగా మారాను. ఇప్పుడు 21 ఏళ్ల తర్వాత అదే రోజున ఫ్యామిలీ స్టార్ సినిమా రిలీజ్ అవుతోంది. మిమ్మల్ని ఫుల్ గా ఎంటర్ టైన్ చేస్తుందీ సినిమా. మాస్, క్లాస్, యూత్ అ, ఫ్యామిలీ అనే తేడాలు లేకుండా యూనివర్సల్ గా అందరికీ నచ్చే కథ ఫ్యామిలీ స్టార్ లో ఉంది. ఒక సూపర్ హిట్ సినిమాతో థియేటర్స్ లోకి వస్తున్నాం. అన్నారు.

# 'మనమే' ఫస్ట్ సింగిల్



ప్రామిసింగ్ హీరో శర్వానంద్ ల్యాండ్‌మార్క్ 35వ చిత్రం 'మనమే' ఇటీవల విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌తో క్యూరియాసిటీని క్రియేట్ చేసింది. టైటిల్ గ్లింప్స్ కూడా చాలా ప్లజంట్ గా ఉంది. ట్యాలెంటెడ్ డైరెక్టర్ శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టిజి విశ్వ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రంలో కృతి శెట్టి కథానాయికగా నటిస్తోంది. వివేక్ కూచిభొట్ల సహ నిర్మాతగా వ్యవహరిస్తుండగా, కృతి ప్రసాద్, ఫణి వర్మ ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు. ఏడిద రాజా అసోసియేట్ ప్రొడ్యూసర్ మేకర్స్ ఫస్ట్ సింగిల్- ఇక నా మాటను విడుదల చేయడం ద్వారా మ్యూజిక్ ప్రమోషన్‌లను ప్రారంభించారు. కంపోజర్ హేషమ్ అబ్దుల్ వహాబ్ రీసెంట్ ఆల్బమ్‌లు ఖుషి, హాయ్ నాన్న బ్లాక్‌బస్టర్‌లుగా కావడంతో టాప్ ఫామ్ లో వున్నారు. హేషమ్ ట్యూన్ స్కోర్ చేయడంతో పాటు, ఈ ఫుట్ ట్యాపింగ్ పాటకు వోకల్స్ కూడా అందించారు. ఈ పాటలో ఉపయోగించిన ప్రతి ఇన్స్ట్రుమెంట్ నేచర్ ఎలక్ట్రానిక్. ఇది ఖచ్చితంగా కాలేజ్ కి వెళ్లే యువతలో, ప్రత్యేకంగా సింగిల్స్ ను అలరించబోతుంది.



# సముద్రుడు ట్రైలర్ విడుదల

కీర్తన ప్రొడక్షన్స్ పతాకంపై రమాకాంత్, అవంతిక, భానుశ్రీ హీరో హీరోయిన్లుగా నగేష్ నారదాసి దర్శకత్వంలో బధా వత్ కిషన్ నిర్మిస్తున్న యాక్షన్ ఎంటర్టైనర్ "సముద్రుడు". అన్ని కార్యక్రమాలు పూర్తిచేసుకుని విడుదలకు సిద్ధమైంది.. ఈ నేపథ్యంలో నేడు ఫిల్మ్ ఛాంబర్ లో చిత్ర యూనిట్ ట్రైలర్ విడుదల చేసింది. ఈ కార్యక్రమంలో తలకోన ప్రొడ్యూసర్ శ్రీధర్ రెడ్డి, దర్శకుల సంఘం అధ్యక్షులు వీర శంకర్, డైరెక్టర్స్ సముద్ర, ప్రముఖ నిర్మాతలు రామ సత్యన్నారాయణ, ముత్యాల రాందాస్, పీపుల్ మీడియా ఎగిక్యూటివ్ ప్రొడ్యూసర్ కాసుల శ్రీధర్, చిత్ర కో ప్రొడ్యూసర్స్ జ్ఞానేశ్వర్, సోములు, చిత్ర నిర్మాత కీర్తన తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు నగేష్ నారదాసి మాట్లాడుతూ "మత్యకారుల జీవితాలను ప్రతిబింబిస్తూ రూపొందించిన చిత్రమిది..సముద్రమే వారి జీవనాధారం.. అలాంటి సముద్రంలోకి వారు వెళ్లకుండా ప్రభుత్వం ఆంక్షలు విధించే పరిస్థితుల్లో వారి జీవన పోరాటం, వారి మనో వేదనే ఈ చిత్రం అన్నారు.. మా చిత్రంలో పెద్ద ఆర్టిస్టులు అందరూ నటించారు. ఈ రోజు మా చిత్ర ట్రైలర్ ను, పాటలను పాత్రికేయుల సమక్షంలో ప్రదర్శించడం ఆనందంగా ఉందని, త్వరలోనే సినిమా రిలీజ్ కూడా చేస్తామన్నారు. హీరో రమాకాంత్ మాట్లాడుతూ "మా సముద్రుడు చిత్ర ట్రైలర్ మరియు పాటలను మీడియా మిత్రులకు చూపించడం చాలా సంతోషం గా వుంది. ఈ చిత్ర నిర్మాణంలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని మొక్కవోని విశ్వాసం తో చిత్రాన్ని అనుకున్న విధంగా పూర్తి చేశామన్నారు..ఈ సందర్భంగా రమాకాంత్ చాలా ఎమోషనల్ అయ్యారు..తప్పక విజయాన్ని అందుకుంటామని నమ్మకం వ్యక్తం చేశారు..ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డైరక్టర్ వీర శంకర్, సముద్ర, నిర్మాతలు తుమ్మలపల్లి రామసత్యనారాయణ, ముత్యాల రామదాసు, షేకింగ్ శేషు వంటి వారు విచ్చేసి టీమ్ మొత్తానికి వారి శుభాకాంక్షలు అందజేశారు.. రమాకాంత్, అవంతిక, భానుశ్రీ, సుమన్, శ్రవణ్, రామరాజు, రాజ్ ప్రేమి, సమ్మెట గాంధీ, ప్రభావతి, జబర్దస్త్ శేష్, చిత్రం శ్రీను తదతరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: సుభాష్ ఆనంద్, ఎడిటర్: నందమూరి హరి, కొరియో గ్రఫి: అనీష్, శ్యామ్, పి ఆర్ ఓ: బి. వీరబాబు, ప్రొడ్యూసర్స్: బదావత్ కిషన్, కో ప్రొడ్యూసర్స్:శ్రీ రామోజు జ్ఞానేశ్వరరావు, సోములు, కథ, స్క్రీన్ ప్లే దర్శకత్వం: నగేష్ నారదాసి.

# శివమల్లాల నిర్మాతగా
## నూతన నిర్మాణ సంస్థ శివమ్ మీడియా



టాలీవుడ్‌లో నూతన నిర్మాణ సంస్థ 'శివమ్ మీడియా' పేరుతో ప్రారంభం అయ్యింది. సీనియర్ జర్నలిస్ట్ శివమల్లాల ఈ బ్యానర్ నిర్మాత. ఈ సినిమా శివమ్ మీడియా లోగో మరియు బ్యానర్‌ను ప్రముఖ నటులు అలీ నిర్మాత, దర్శకులు ప్రవీణా కడియాల , అనిల్ కడియాల చేతుల మీదుగా బ్యానర్‌ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అలీ మాట్లాడుతూ–" శివ నా తమ్ముడు లాంటివాడు. గత 20 ఏళ్లుగా వ్యక్తిగతంగా నాకు ఎంతో సన్నిహితుడు. చిన్నస్థాయి నుండి కెరీర్‌ను ప్రారంభించి నిర్మాతగా తన బ్యానర్‌ను స్థాపించి ముందుకు వెళ్లటం ఆనందంగా ఉంది" అన్నారు. జ్ఞాపిక ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మాత ప్రవీణా కడియాల మాట్లాడుతూ– " ఈరోజు నాకు ఎంతో ఆనందంగా ఉంది. మా ముందు చిన్న రిపోర్టర్‌గా పిఆర్వోగా పనిచేసిన మా శివాయేనా ఒక బ్యానర్‌ని పెట్టింది అనిపిస్తుంది. 'శివమ్ మీడియా' విషయంలో నేను ఎంతో ప్రౌడ్‌గా ఫీలవుతున్నాను. ఈ బ్యానర్‌ద్వారా డబ్బింగ్ సినిమానా, స్ట్రెయిట్ సినిమానా అనే తేడా లేకుండా అనేక మంచి సినిమాలు వస్తాయని రావాలని కోరుకుంటున్నా" అన్నారు. ఈ ముగ్గురు చేతుల మీదుగా నా బ్యానర్‌ని ప్రారంభించటం ఎంతో హ్యాపీ.

# ఆ సినిమానే నన్ను మార్చింది



ప్రియమణి సెకండ్ ఇన్నింగ్స్ అభినందనీయంగా ఉంది. ఆమె బాలీవుడ్‌లో నటించిన 'ఆర్టికల్ 370' చిత్రం ఇటీవలే విడుదలై విమర్శకుల ప్రశంసలందుకుంటున్నది. ఏప్రిల్ 10న అజయ్‌దేవగణ్‌తో ఆమె నటించిన 'మైదాన్' కూడా విడుదల కానుంది. ఫుట్‌బాల్ కోచ్ సయ్యద్ అబ్దుల్ రహీం జీవితం ఆధారంగా అమిత్‌శర్మ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో ప్రియమణి కీలక పాత్ర పోషించింది. ఈ సినిమా ప్రమోషన్‌లో భాగంగా మీడియాతో ఆసక్తికరంగా మాట్లాడింది ప్రియమణి. 'కెరీర్ తొలినాళ్లలో ఏది తప్పో ఏది ఒప్పో తెలిసేది కాదు. వచ్చిన ప్రతి పాత్రకూ ఒప్పుకునేదాన్ని. 'పరుత్తివీరన్' నటిగా నా దృక్పథాన్ని మార్చింది. ఆ సినిమాతో జాతీయ అవార్డు అందుకున్నాను. అప్పట్నుంచి స్వీయవిమర్శను అలవరచుకున్నాను. కొత్తగా చేయాలనే తపన మొదలైంది. కథలు ఎంచుకునే తీరు మారింది. ఇప్పుడు నా వయసుకు తగ్గ పాత్రలు చేస్తున్నాను. నటిగా నా బాధ్యత మరింత పెరిగినట్టుగా ఉంది' అంటూ చెప్పకొచ్చింది ప్రియమణి. అజయ్‌దేవగణ్‌తో కలిసి 'మైదాన్'లో నటించడం పట్ల ఆమె ఆనందం వ్యక్తం చేసింది. అజయ్‌దేవగణ్‌ను ఓ అద్భుతంగా ఆమె అభివర్ణించింది. కళ్లతోనే అన్ని భావాలూ పలికించగల అద్భుతమైన నటుడు అజయ్‌దేవగణ్ అనీ, రేపు 'మైదాన్'లో ఆయన్ను చూసి ప్రేక్షకులు ఆశ్చర్యపోతారని తెలిపింది

# ప్రేక్షకుల అంచనాలకు తగ్గకుండా టిల్లు స్క్వేర్



ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో చిత్ర బృందం

ఈమధ్య కాలంలో తెలుగు ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్న సీక్వెల్ అంటే 'టిల్లు స్క్వేర్' అని చెప్పవచ్చు. స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటించిన 'డీజే టిల్లు' ఎంతటి విజయాన్ని సాధించిందో తెలిసిందే. ఈ చిత్రం యువత మరియు సినీ ప్రియుల్లో కల్ట్ ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది. దాంతో ఈ చిత్రానికి సీక్వెల్ గా వస్తున్న 'టిల్లు స్క్వేర్'పై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. పాటలు, ప్రచార చిత్రాలు ఆ అంచనాలను రెట్టింపు చేశాయి. అర్థమై మాకు ఎంతో సాయం చేశారు. భీమ్స్ సిసిరోలియో గారి నేపథ్య సంగీతం అద్భుతంగా ఉంది. టిల్లు లో మాస్ ని తన సంగీతంతో ఇంకా ఎక్కువ తీసుకొచ్చారు. మార్చి 29న థియేటర్లలో చాలా చాలా నవ్వబోతున్నారు. చాలా థ్రిల్స్, షాక్ లు, సర్ ప్రైజ్ లు ఉంటాయి. మాస్ క్లైమాక్స్ ని చూడబోతున్నారు. టిల్లు స్క్వేర్ మీ అంచులను ఏమాత్రం తగ్గకుండా ఉంటుంది. తాజాగా నేను, అనుపమ కలిసున్న పోస్టర్ విడుదల చేసినప్పుడు.. కొందరు నెగటివ్ కామెంట్స్ రాశారు. అమ్మాయిలను అలా కామెంట్ చేయడం కరెక్ట్ కాదు. ఈ విషయంలో దృష్టిలో పెట్టుకుంటారని ఆశిస్తున్నాను." అన్నారు. చిత్ర దర్శకుడు మల్లిక్ రామ్ మాట్లాడుతూ.. "గత రెండేళ్లుగా 'డీజే టిల్లు' పాటలను, మాటలను మీ జీవితంలో ఒక భాగం చేశారు. ఇప్పుడు 'టిల్లు స్క్వేర్' చిత్రాన్ని కూడా అలాగే ఆదరిస్తారని కోరుకుంటున్నాను. మార్చి 29న థియేటర్లకు వెళ్ళి చూడండి, ఖచ్చితంగా ఈ సినిమా మీకు నచ్చుతుంది. నాకు ఈ అవకాశం ఇచ్చిన నాగవంశీ గారికి, చినబాబు గారికి, త్రివిక్రమ్ గారికి ధన్యవాదాలు. సిద్ధుతో ఈ రెండేళ్ల ప్రయాణాన్ని ఎప్పటికీ మర్చిపోలేను. ఈ ప్రయాణంలో నాకు సహకరించిన నటీనటులు, సాంకేతిక నిపుణులు అందరికీ కృతజ్ఞతలు. 'డీజే టిల్లు' మిమ్మల్ని ఎంతలా అలరించిందో.. 'టిల్లు స్క్వేర్' మిమ్మల్ని అంతకుమించి అలరిస్తుంది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.